బుధవారం
26-10-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 124
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

పీఎల్ఏ శతవార్షిక లక్ష్యాలపై దృష్టి

2లో

ఆకాశంలో అద్భుత ఘట్టం

భారత్‌లో పాక్షికంగా సూర్యగ్రహణం

తెలుగు రాష్ట్రాలు సహా దేశంలోని అనేక ప్రాంతాల్లో సూర్యగ్రహణం పాక్షికంగా కనిపించింది. అయితే కొన్ని ఇతరదేశాల్లో గ్రహణం చూపరులకు కనువిందు చేసింది. మన దేశంలోనూ అనేక ప్రాంతాల నుంచి ఈ గ్రహణాన్ని చూశారు. తెలుగు రాష్ట్రాల్లో సైతం అనేక ప్రాంతాల్లో పాక్షిక సూర్యగ్రహణం దర్శనమిచ్చింది.

8లో

అమెరికాలో కార్మిక సంఘాల పునరుజ్జీవనం

- నామమాత్రపు వేతనాలపై సిబ్బందిలో అసంతృప్తి
- యూనియన్లలో చేరేందుకు దిగ్గజ సంస్థల ఉద్యోగుల ఆసక్తి
- 200 స్టార్‌బక్స్ అవుట్‌లెట్లలో సంఘాల ఏర్పాటు

వాషింగ్టన్: ప్రపంచ వ్యాప్తంగా కార్మిక ఉద్యమాలు, మహత్తర పోరాటాల ద్వారా హక్కులు, పని గంటల తగ్గింపు సాధనకు దోహదం చేసింది అమెరికా చికాగోలోని హేగ్ మార్కెట్‌లో 1860, మే 1 కార్మికుల సమ్మె. ఆనాటి సమ్మెపై పోలీసులు కాల్పులు జరిపి ఆరుగురి ప్రాణాలు పొట్టన పెట్టుకున్నారు. ఆనాటి నుంచి నేటి వరకు మేడే జరుపుకుంటూ ఇప్పటికీ కార్మికులు తమ హక్కుల సాధన కోసం ఉద్యమాలు జరుపుతూనే ఉన్నారు. అయితే కార్మికుల హక్కులను, సాధించుకున్న సౌకర్యాలను తుంగలో తొక్కడానికి అనేక దేశాలలో మితవాద, మతవాద ప్రభుత్వాలు పాలనలోకి రావడం విచారకరం. ఉద్యమాలకు నాంది పలికిన అమెరికాలో కార్మిక యూనియన్లు మళ్లీ ప్రభవిస్తున్నాయి. అక్కడ గంటల ప్రకారం పనులు చేస్తూ చదువుకోవడం వల్ల యూనియన్లు ఏర్పాటు చేయడం కష్టంగా మారింది. ఇప్పుడు ప్రపంచ వాణిజ్య మార్కెట్లను ముంచెత్తుతున్న గూగుల్, అమెజాన్ లాంటి దిగ్గజాలైన సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులు యూనియన్లలో చేరడానికి ఇష్టపడుతున్నారు.

గత డిసెంబర్ నుంచి దేశవ్యాప్తంగా 200 స్టార్‌బక్స్ అవుట్‌లెట్స్‌లో కార్మికులు, ఉద్యోగులు యూనియన్లు ఏర్పాటు చేసుకున్నారు. ఒక్లహోమలోని యాపిల్ స్టోర్‌లో పది రోజుల క్రితం 71 శాతం మంది యూనియన్‌లో చేరడానికి ఓటు వేశారు. ఆ తర్వాత మేరీలాండ్‌లోని యాపిల్ స్టోర్‌లోనూ యూనియన్ ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించారు. 1965 తర్వాత ఈ సంస్థల బ్రాంచిలున్న అనేకచోట్ల 71 శాతం మంది కార్మికులు యూనియన్లు

- మిగతా 2 లో

A. P. HIGHER EDUCATION REGULATORY & MONITORING COMMISSION
(APHER&MC)



ఫీజు నియంత్రణ ఎక్కడ?

జాడలేని కమిషన్లు

- పాఠశాల, ఉన్నత విద్యలో దోపిడీ
- సీబీఎస్ఈ సిలబస్ పేరుతో భారీ ఫీజులు
- చట్టాలు అలంకారప్రాయం
- వేలాది కోట్ల ఖర్చు వృథా... ప్రయోజనం శూన్యం

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: పాఠశాల, ఉన్నత విద్యలో అధిక ఫీజుల నియంత్రణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన కమిషన్లు నిర్వీర్యంగా మారుతున్నాయి. సీఎం జగన్ ఆశయం మేరకు పాఠశాల, ఉన్నత విద్యా పరిరక్షణ కోసం ఫీజు రెగ్యులేటరీ, మానటరింగ్ కమిషన్లను వేర్వేరుగా ఏర్పాటు చేశారు. వాటికి ప్రత్యేకంగా కార్యాలయాలు, చైర్మన్, పాలకవర్గాలు, అధికారులను నియమించారు. వారికి లక్షల కొద్దీ వేతనాలు కేటాయిస్తున్నారు. మూడున్నరేళ్లలో ఫలితాలు మాత్రం నిరాశాజనకంగానే ఉంటున్నాయి. పాఠశాల విద్యలో ఫీజుల నియంత్రణ కోసం తీసుకొచ్చిన 53, 54 జీవోలను సైతం అమలు చేయించలేకపోయారు. ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యం తరపున అసోసియేషన్లు కోర్టును ఆశ్రయించడంతో అవి నిర్వీర్యమయ్యాయి. 2022-23 విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటికీ, ఇంతవరకు ఫీజు నియంత్రణపై కదలిక లేదు. ఆయా చైర్మన్ల అధ్వర్యంలో ఒక్క సమావేశం కూడా జరగలేదు. ఇదే అదునుగా కార్పొరేట్/ప్రైవేట్ విద్యా సంస్థలు ఇష్టానుసారంగా ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నాయి. సీబీఎస్ఈ సిలబస్‌తో వివిధ కార్పొరేట్ విద్యా సంస్థలను నడుపుతూ భారీగా ఫీజులు దండుకుంటున్నప్పటికీ, కమిషన్ల చైర్మన్లు చర్యలు చేపట్టడం లేదు. శాసనసభ సాక్షిగా చేసిన చట్టాల ఆధారంగా ఏర్పడిన కమిషన్లు నీరుగారిపోతున్నాయి. దీని కార్యకలాపాల అమలు కోసం విద్యార్థి, యువజన సంఘాలు, ఏపీ పేరెంట్స్ అసోసియేషన్ ప్రభుత్వానికి ఫిర్యాదులు చేసినప్పటికీ కదలిక లేదు. పెద్దఎత్తున ప్రజాధనం వినియోగించి ఏర్పాటు చేసిన ఈ చట్టాల వల్ల ఉపయోగం ఏమిటనేదీ ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వ చట్టాలకు వ్యతిరేకంగా ఉన్న విద్యాసంస్థలను ఆ కమిషన్లు నియంత్రించలేకపోయాయి. మూడున్నరేళ్ల నుంచి ప్రభుత్వం

- మిగతా 2 లో

షిండే వర్గంలో అసంతృప్తి ?

- బీజేపీ వైపు 22 మంది ఎమ్మెల్యేల చూపు
- త్వరలో పార్టీ మారతారు : సామ్నా

8లో

బంగ్లాదేశ్‌లో సిత్రాంగ్ బీభత్సం

16 మంది మృతి

అంధకారంలో 15 కోస్తా జిల్లాలు

2లో

వీసీలకు కేరళ హైకోర్టులో ఊరట

తిరువనంతపురం: ముఖ్యమంత్రి పినరయి విజయన్ నేతృత్వంలోని కేరళ ప్రభుత్వం తొమ్మిది విశ్వవిద్యాలయాలకు నియమించిన ఉప కులపతులకు రాష్ట్ర హైకోర్టులో సోమవారం కాస్త ఊరట లభించింది. గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ తుది ఆదేశాలు జారీ చేసే వరకు వీరు పదవుల్లో కొనసాగవచ్చునని న్యాయస్థానం సోమవారం మధ్యంతర ఉత్తర్వులో తెలిపింది. దీపావళి పండుగ అయినప్పటికీ ప్రత్యేకంగా ఈ అంశంపై విచారణ జరిపింది. విజయన్ ప్రభుత్వం తొమ్మిది విశ్వవిద్యాలయాలకు వైస్ ఛాన్సలర్లు (వీసీలు)ను నియమించింది. గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ మొత్తం తొమ్మిది మంది వీసీలకు పదవిలో కొనసాగడా నికి న్యాయపరమైన హక్కును చూపాలని ఆయన నోటీసులు అందించారు. నవంబర్ 3లోగా

- మిగతా 2 లో

ఐదు రెట్లు పెరిగిన విద్వేష ప్రసంగాలు

- సీపీఐ కార్యదర్శి అజీజ్ పాషా విమర్శ
- అమలుకాని పునర్విభజన హామీలు: చాడ
- మునుగోడు ప్రజలు బీజేపీ ఆటలు సాగనీయరు: కూనంనేని

విశాలాంధ్ర–హైదరాబాద్: దేశంలో ఎన్డీయే అధికారంలోకి వచ్చాక 2014 నుంచి 2019 వరకు విద్వేష ప్రసంగాలు 500 శాతం పెరిగినట్లు ఒక మీడియా సంస్థ సర్వేలో తేలిందని సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా తెలిపారు. ఈ విషయమై ఇప్పటికే అంతర్జాతీయ సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోందన్నారు. మోదీ నేతృత్వంలోని భారత ప్రభుత్వం దీనిని సరి చేసుకోవాలని, అలా జరిగితేనే మనకు ఐక్య రాజ్య సమితిలో శాశ్వత సభ్యత్వం వచ్చే అవకాశం ఉన్నదని అన్నారు. ఇక్కడి మఖ్దూంభవన్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మోదీ పాలనలో నిరుద్యోగం, ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, శ్రీలంక ను మించిన దుర్భర ఆర్థిక పరిస్థితులు దేశంలో నెలకొని ఉన్నాయన్నారు. మందిర్, మసీదు అంటూ విద్వేషాలు రెచ్చగొడుతూ వైఫల్యాలను కప్పి పుచ్చుకుంటున్నారని అజీజ్ పాషా విమర్శించారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ, గడిచిన ఎనిమిదేళ్లలో ఏపీపునర్విభజన హామీలలో ఒక్కటి కూడా మోదీ ప్రభుత్వం నెరవేర్చలేదని విమర్శించారు. ఎన్డీయే పాలనలో ప్రజల కొనుగోలు శక్తి తగ్గిందని, నిరుద్యోగం పెరిగిందని, ధరలు విపరీతంగా పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటికి కారణమైన బీజేపీ తెలంగాణలో పాగా వేసేందుకు మునుగోడును ప్రయోగశాలగా చేస్తోందని విమర్శించారు. వామపక్ష , అభ్యుదయ భావాలు కలిగిన మునుగోడు ప్రజలు బీజేపీ ఆటలు సాగనీయరని అన్నారు. కేంద్ర బలగాలను దుర్వినియోగం చేసేందుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నాలను ఓటర్లు తిప్పికొడతారని చాడ వెంకటరెడ్డి అన్నారు. దేశానికి ప్రథమ శతృవైన బీజేపీని మునుగోడు ఉప ఎన్నికలో ఓడించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు.

డబ్బు, అధికారం అడ్డుపెట్టుకొని గెలవచ్చనే ధీమాతో తెలంగాణలో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే విధంగా మునుగోడు నియోజకవర్గంలో బీజేపీ ఉప ఎన్నిక తీసుకువచ్చిందని అన్నారు. విలేకరుల సమావేశంలో సీపీఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి, పశ్య పద్మ, ఎన్.బాలమల్లేశ్, ఈటీనర్సింహా, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య పాల్గొన్నారు.

చేతల మనిషిని

బ్రిటన్ కొత్త ప్రధాని సునాక్

లండన్ : "మాటలతో కాకుండా కార్యాచరణతో నేను మనదేశాన్ని ఐక్యపరుస్తాను. అందుకొరకు రాత్రింబవళ్లు నేను కృషి చేస్తాను. విశ్వాసం సంపాదించుకోవాలి.. నేను సంపాదిస్తాను. ఈ తీర్పు మనందరిదీ, అందరినీ ఐక్యంగా వుంచేందుకు సంబంధించింది. మన తీర్పునకు గుండె కాయవంటిది మన ప్రణాళిక" అని ప్రధానమంత్రిగా తన తొలి ప్రసంగంలో రిషి సునాక్ ఉద్ఘాటించారు. బ్రిటన్ ఎదుర్కొంటున్న అధిక ద్రవ్యోల్బణం, రుణవ్యయాలు పెరిగిపోవటం, అనివార్య ఆర్థికమాంద్యం దృష్ట్యా కష్టపడి పనిచేస్తానని సునాక్ ప్రతినబూనారు. పార్టీలో విభజన,

- మిగతా 2 లో

ఇదీ లోకం!

మట్టా,మశానమా? చెంబుడు నీళ్లా? ఏం తెస్తున్నాడో ముందో కనుక్కోండి!

రాజ్‌భవన్లకు కదం తొక్కుదాం

- అన్ని రాష్ట్రాలకు సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు
- నవంబరు 26కు చరిత్రాత్మక రైతు ఉద్యమానికి రెండేళ్లు
- 14న ఢిల్లీలో భేటీ-తదుపరి కార్యాచరణపై నిర్ణయం

న్యూఢిల్లీ: సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) ఆధ్వర్యంలోని చరిత్రాత్మక రైతాంగ ఉద్యమానికి నవంబరు 26వ తేదీకి రెండేళ్లు పూర్తి అవుతాయి. ఈ సందర్భంగా రాజ్‌భవన్ వరకు మార్చ్ నిర్వహించాలని అన్ని రాష్ట్రాలకు ఎస్‌కేఎం పిలుపునిచ్చింది. ఇదే క్రమంలో నవంబరు 14న ఢిల్లీలో ఎస్‌కేఎం సమావేశం జరగనున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో రైతు నేతలు దర్శన్‌పాల్, హన్నన్ మొల్లా, జోగిందర్ సింగ్ ఉగ్రాహన్, యుధ్వీర్ సింగ్ తెలిపారు. ఈ సమావేశంలో రాజ్‌భవన్ వరకు మార్చ్ నిర్వహణ, గవర్నర్లకు వినతిపత్రాలు అందజేయడం, భవిష్యత్ కార్యాచరణపై చర్చిస్తామన్నారు. అలాగే, సమన్వయ కమిటీ–ముసాయిదా కమిటీ సభ్యుల మధ్య చర్చల గురించి సంప్రదింపులు జరుపుతామని నేతలు తెలిపారు. మంగళవారం జరిగిన ఎస్‌కేఎం సమావేశంలో దర్శన్ పాల్, హన్నన్ మొల్లా, జోగిందర్ సింగ్‌తో పాటు మేధా పాట్కర్, రాజారామ్ సింగ్, అతుల్ కుమార్ అంజాన్, సత్యావన్, డాక్టర్ అశోక్ ధవాలే, అవిక్ సహా, సుఖ్‌దేవ్ సింగ్, రమిందర్ సింగ్, వికాస్ శిషిర్, డాక్టర్ సునీలమ్ పాల్గొన్నారు. అటవీ సంరక్షణ చట్ట నిబంధనల్లో కేంద్రప్రభుత్వం చేస్తున్న సవరణలను

- మిగతా 2 లో

తీవ్ర నిరాశలో యువత

- మందగించిన ఉద్యోగ కల్పన
- ఆగస్టులో 7.1 శాతానికి క్షీణత
- అసంఘటిత రంగంపై పాలకుల శీతకన్ను

న్యూఢిల్లీ : దేశంలో ఉపాధి అవకాశాలు నానాటికీ క్షీణిస్తున్నాయి. పాలకుల అస్తవ్యస్త విధానాల కారణంగా అసంఘటిత రంగం ఛిద్రమైంది. యువత ఉద్యోగాల లేక తీవ్ర నిరాశలో కూరుకుపోయారు. కోవిడ్ అనంతర పరిస్థితులు ఇందుకు కారణమైనప్పటికీ, ఉపాధి కల్పనకు చర్యలు తీసుకోవడం పై కేంద్ర, రాష్ట్రాల పాలకులకు చిత్తశుద్ధి కొరవడటం మరొక కారణం. ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్, ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్, జాతీయ పింఛను పథకం నాలుగు నెలల పాటు ఉత్సాహంగా కొనసాగిన తర్వాత ఆగస్టులో భారతదేశంలో అధికారిక ఉద్యోగ కల్పన మందగించింది. మంగళవారం గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ ప్రారంభించిన తాత్కాలిక పేరోల్ సమాచారం ఈపీఎఫ్‌వో క్రింద ఇంటర్‌నెట్ కొత్త చందాదారుల చేరిక ఏప్రిల్‌లో 15.3 లక్షలు, మేలో 16.8 లక్షలు, జూన్‌లో 18.3 లక్షలు, జులైలో 18.2 లక్షలతో పోలిస్తే, ఆగస్టులో 7.1 శాతం తగ్గి 16.9 లక్షలకు చేరుకుంది. అలాగే ఏప్రిల్‌లో 12.8 లక్షలు, మేలో 15.1 లక్షలు, జూన్‌లో 15.6 లక్షలు, జులైలో 15.8 లక్షలతో పోలిస్తే ఆగస్టులో ఈఎస్ఐసీ ఇంటర్నెట్ చందాదారుల

- మిగతా 2 లో

బంగ్లాదేశ్‌లో సిత్రాంగ్ బీభత్సం

16 మంది మృతి - అంధకారంలో 15 కోస్తా జిల్లాలు

కువాకట: బంగ్లాదేశ్‌పై భారీ తుపానుగా మారిన సిత్రాంగ్ విరుచుకుపడింది. బీభత్సం సృష్టించింది. దీంతో తీర ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో 15 కోస్తా జిల్లాలు అంధకారంలో చిక్కుకున్నాయి. టెలికం సేవలకు అంతరాయం కలిగింది. భారీ వృక్షాలు నేలకూలాయి. ఇప్పటికే 16 మంది మృత్యువాత పడ్డారు. లక్షలాది మంది తమ ఇళ్లు, వాకిళ్లు వదిలి సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాల్సి వచ్చింది. ఇందుకోసం అనేకమంది విముఖ వ్యక్తం చేయగా పోలీసులు వారిని తరలించినట్లు అధికారులు తెలిపారు. దక్షిణ - ఆగ్నేయంలోని ప్రాంతాల్లో పాఠశాలలను మూసివేశారు. సోమవారం పొద్దుపోయాక సిత్రాంగ్ తుపాను తీరం దాటి ఈదురు గాలులతో వాతావరణం మారిపోయింది. భారీ వృక్షాలు కూలిపోయాయి. జమునా నదిలో పడవ మునిగి ఇద్దరు చనిపోయారు. ఆస్తినష్టం భారీగా జరిగిందిగానీ అంచనా వేయాల్సి ఉందని అధికారి ఒకరు తెలిపారు. లోతట్టు ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని, వేలాది సంఖ్యలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని విపత్తు నియంత్రణ శాఖ కార్యదర్శి కామ్రుల్ ఎహ్‌సాన్ తెలిపారు. రాజధాని ఢాకాతో పాటు ఖుల్నా, బరిసల్‌లో కుండపోత కురిసింది. సోమవారం 324 మిమీల వర్షపాతం నమోదు అయిందని అధికారులు వెల్లడించారు. మిన్మార్ నుంచి వచ్చిన 33,000 మంది రొహింగ్యాల తరలింపు వివాదాస్పదంగా కాగా వారిని ఇళ్లకే పరిమితం కావాలని సూచించామని, ఆస్తి, ప్రాణ నష్టం సమాచారం లేదని అధికారులు చెప్పారు. దక్షిణ ద్వీపమైన మహేశ్‌కలిలో చెట్లు కూలిపోగా విద్యుత్, టెలికం సేవలకు అంతరాయం కలిగి ఈదురుగాలులకు తమ ఇళ్లు కూలుతాయన్న భయంతో స్థానికులు రాత్రి బిక్కుబిక్కుమంటూ గడిపారన్నారు. ఇళ్లు నీటమునిపోయి పాములు రావడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. బరిసల్ ప్రాంతంలో పరిస్థితి ఘోరమని, భారీగా పంట నష్టం జరిగిందని జిల్లా అధికారి అమిరుల్ ఎహ్‌సాన్ అన్నారు.

బ్రిటన్ నూతన ప్రధాని సునాక్

నియమించిన రాజు ఛార్లెస్-3

లండన్: దాదాపు 100 సంవత్సరాలు భారత్‌ను పరిపాలించిన యునైటెడ్‌కింగ్‌డమ్ (బ్రిటన్) ప్రధానమంత్రిగా భారత్ సంతతికి చెందిన రిషి సునాక్‌ను బ్రిటన్ రాజు ఛార్లెస్-3 నేడు నియమించారు. కేవలం 45 రోజులు మాత్రమే ప్రధానిగా అధికారంలో కొనసాగి అవమానకరంగా నిష్క్రమించిన లిజ్‌ట్రస్ వారసుడిగా సునాక్ నియమితులయ్యారు. ఆర్థిక సంక్షోభం అనంతరం బ్రిటన్‌లో నాయకత్వం మార్పు జరిగింది. మాజీ ప్రధాని బోరిస్ జాన్సన్ పోటీ ప్రయత్నం నుండి విరమించుకోవడం, మరో ప్రత్యర్థి పెన్నీ మార్డాంట్ ఎంపీల నుండి తగినంత మద్దతును పొందలేకపోవడంతో సునాక్ సోమవారం కన్జర్వేటివ్ పార్టీ నాయకుడయ్యారు. గత రెండు శతాబ్దాలలో అతి పిన్న వయస్కుడైన బ్రిటన్ ప్రధానిగా 42 సంవత్సరాల సునాక్ నిలిచారు. పౌండ్ విలువను దిగజారుస్తూ లిజ్‌ట్రస్ పన్నుకోత బడ్జెట్ మార్కెట్‌లో ప్రకంపనలు సృష్టించడానికి ముందే ఆర్థిక మాంద్యానికి దారితీసిన ఆర్థిక వ్యవస్థ వారసత్వాన్ని సునాక్ అందిపుచ్చుకున్నారు. రాణి ఎలిజబెత్ మరణానికి రెండు రోజులు ముందుగా గత నెల 8న ట్రస్‌ను ప్రధానమంత్రిగా నియమించగా నూతన రాజు ఛార్లెస్-3 మంగళవారం సునాక్‌ను తొలి ప్రధానమంత్రిగా నియమించారు.

సునాక్ తల్లితండ్రులు 1960వ దశకంలో తూర్పు ఆఫ్రికా నుండి బ్రిటన్ వలస వచ్చారు. భారత సాంకేతిక పరిజ్ఞాన దిగ్గజం ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి కుమార్తె అక్షత మూర్తిని సునాక్ వివాహం చేసుకున్నారు.

ప్రభుత్వ రుణభారం అప్పటికే బాగా పెరిగిన నేపథ్యంలో పన్నుకోత విధిస్తానని ట్రస్ వాగ్దానం చేయటం తప్పుడు విధానాన్ని అనుసరించటమేనని మాజీ ఆర్థికశాఖ ఛాన్సలర్‌గా సునాక్ హెచ్చరించారు. డాలర్‌తో పోల్చుకుంటే పౌండ్ రికార్డుస్థాయి దిగువకు పడిపోవటంతో సునాక్ చెప్పింది నిజమేనని రుజువయ్యింది. సునాక్ కన్జర్వేటివ్ పార్టీ నాయకుడిగా ఎన్నిక కావడంతో మార్కెట్లలో స్థిరత్వం చోటు చేసుకుంది. పౌండ్ విలువ పెరిగింది.

'ఈ దశలో అత్యంత క్లిష్టకరమైనప్పటికీ ఆర్థిక వ్యవస్థను, రాజకీయ పరిస్థితిని సునాక్ సుస్థిరం చేస్తారని పెట్టుబడులు పెట్టేవారు స్పష్టంగా ఆశాభావం వ్యక్తం చేస్తున్నారని' ఎజ్‌బెల్ ఆర్థిక విశ్లేషకుడు డానీ హ్యూసన్ చెప్పారు. 'పౌండు పుంజుకోవడం, ప్రభుత్వ రుణవ్యయం తగ్గడంతో యూరోపియన్ గ్యాస్ ధరలు పడిపోగలవని సునాక్ భావిస్తున్నారు. భారీ ఇంధన బిల్లులతో పోరాడుతున్న వాణిజ్యవేత్తలకు సహాయం చేయాలని కూడా బ్రిటిష్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ డైరెక్టర్ జనరల్ షివాన్ హావిలాండ్ సునాక్‌కు విజ్ఞప్తి చేశారు. 'గత కొన్ని నెలలుగా నెలకొన్న రాజకీయ, ఆర్థిక అస్థిరత్వం ఇప్పుడు అంతం కాగలదని బ్రిటీష్ వాణాజ్యవేత్తలు నమ్మకంతో ఉన్నట్లు సునాక్ నియామకం ధృవీకరణ అయిన అనంతరం హావిలాండ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

భారత ప్రధాని అభినందనలు

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం రిషి సునాక్‌కు 'హృదయపూర్వక అభినందనలు పంపించారు.' మీరు ప్రధానమంత్రి కావడంతో ప్రపంచ సమస్యలపైన, 2030 కార్యచరణ పథకం అమలుకు సన్నిహితంగా కలిసి పనిచేయడానికి నేను ఎదురు చూస్తున్నాను. బ్రిటన్‌లోని భారతీయులకు దివాళీ ప్రత్యేక శుభాకాంక్షలు. మన చారిత్రక సంబంధాలను నవీన భాగస్వామ్యం చేద్దాం' అని మోదీ ట్వీట్ చేశారు.

పీఎల్‌ఏ శతవార్షిక లక్ష్యాలపై దృష్టి

సైన్యానికి జిన్‌పింగ్ పిలుపు

బీజింగ్: 'పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ' (ప్రజా విమోచన సైన్యం-సీపీసీ) శతవార్షికోత్సవ సంవత్సరమైన 2027 నాటికి పూర్తిచేయవలసిందిగా సీపీసీ సెంట్రల్ కమిటీ సాయుధ బలగాలకు రూపొందించిన లక్ష్యాలను సాధించవలసిందిగా సాయుధ బలగాలను చైనా కమ్యూనిస్టు పార్టీ (సీపీసీ) ప్రధాన కార్యదర్శి జిన్‌పింగ్ చైనా సైన్యానికి సోమవారం విజ్ఞప్తి చేశారు. చైనాను నవీనీకరించేందుకు, సోషలిస్టు దేశం నిర్మించేందుకు వ్యూహాత్మకంగా ముందుగా అవసరమైన ప్రపంచశ్రేణి బలగంగా చైనా సైనిక నిర్మాణాన్ని పీఎల్‌ఏ శతవార్షికోత్సవం నాటికి చైనా సైన్యం పూర్తిచేయాలని జిన్‌పింగ్ పేర్కొన్నారు. ఆదివారం ముగిసిన సీపీసీ మహాసభల తరువాత తొలి సైనిక సమావేశంలో ఉన్నతశ్రేణి సైనికాధికారులతో జిన్‌పింగ్ మాట్లాడారు. రానున్న ఐదేళ్లలో చైనా సాయుధ బలగాలకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని చైనా అధ్యక్షుడు, సెంట్రల్ మిలిటరీ కమిషన్ చైర్మన్ కూడా అయిన జిన్‌పింగ్ పిలుపిచ్చారు. అందుకొరకు, 2027 నాటికి ఆ లక్ష్యాలను సాధించడానికి అన్ని ప్రయత్నాలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సైన్యం బలోపేతానికి పార్టీ ఆలోచనను సాయుధ బలగాలలోని సభ్యులందరూ క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలని, పార్టీ ఆలోచనా సారాంశాన్ని జాగ్రత్తగా అధ్యయనం చేసి ప్రపంచశ్రేణి సైన్యంగా చైనా సైన్యాన్ని నిర్మించేందుకు దృష్టి కేంద్రీకరించాలని ఆయన పేర్కొన్నారు. పీఎల్‌ఏ శతవార్షికోత్సవ లక్ష్యాలను నెరవేర్చడానికి కమాండర్లు, అధికారులు, సైనికులు కృషిచేసి, పటిష్టమైన శిక్షణ ఇవ్వాలని జిన్‌పింగ్ ఉద్ఘాటించారు.

రాజ్‌భవన్లకు కదం తొక్కుదాం..

(మొదటిపేజీ తరువాయి)

సమావేశం ఖండించింది. ఉద్యమనేత బిర్సాముండా జయంతిని పురస్కరించుకొని తమ సంఘీభావాన్ని నవంబరు 15న తెలపాలని నిర్ణయించింది. బిర్సా ముండా ఆదివారీ ఉద్యమనేత, వారి హక్కుల కోసం పాటుపడ్డారని గుర్తుచేసింది. రైతు నేత పరంజీత్ సింగ్ మరణానికి సంతాపం ప్రకటించింది. ఈయన 380 రోజుల రైతుల ఉద్యమానికి ఎంతో తోడ్పడ్డారని ఎస్‌కేఎం వెల్లడించింది.

మరో రెవెన్యూ డివిజన్ చింతూరు

ఏటిపాక, కూనవరం, వర రామచంద్రాపురం మండలాలతో...

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అల్లూరి సీతారామరాజు జిల్లాలో చింతూరు కేంద్రంగా మరో కొత్త రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీలో కొత్త జిల్లాల ఏర్పాటు, కొత్త రెవెన్యూ డివిజన్లు, రెవెన్యూ మండలాల ఏర్పాటు ప్రక్రియ ఇంకా కొనసాగుతూనే ఉంది. 13 జిల్లాలుగా ఉన్న ఏపీని 26 జిల్లాలుగా మార్చిన వైసీపీ ప్రభుత్వం...రాష్ట్రాన్ని మొత్తం 74 రెవెన్యూ డివిజన్లుగా విభజించింది. నిన్నటిదాకా రెవెన్యూ డివిజన్ల సంఖ్య 73గా ఉండగా కొత్తగా అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఏటిపాక, కూనవరం, వర రామచంద్రాపురం, చింతూరు మండలాలతో కలిపి చింతూరు రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేసింది.

2024లో తెరుచుకోనున్న అయోధ్య రామాలయం

నిర్మాణం సగానికిపైగా పూర్తి

అయోధ్య: అయోధ్య రామాలయం ద్వారాలు 2024 జనవరికి భక్తుల కోసం తెరుచుకోనున్నట్లు శ్రీరామ్ జన్మభూమి తీర్థక్షేత్ర తెలిపింది. ఆలయ నిర్మాణం సగానికిపైగా పూర్తి అయిందని, పనులు సంతృప్తికరంగా జరుగుతున్నాయని పేర్కొంది. 2024లో సంక్రాంతికి భక్తుల కోసం ఆలయాన్ని తెరవాలని, ఆలోగా రామలల్లా విగ్రహాల ప్రతిష్ఠ పూర్తికావాలని భావిస్తున్నట్లు ట్రస్టు ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ మంగళవారం తెలిపారు. వచ్చేఏడాది డిసెంబరు నాటికి కింది అంతస్తు పూర్తి అవుతుందని, 2024, జనవరి 14కి రాముడి విగ్రహాలు ప్రతిష్ఠిస్తామని చెప్పారు. ఆలయ నిర్మాణ అంచనా వ్యయం రూ.1800 కోట్లు అన్నారు. 2020, ఆగస్టు 5న ఈ ఆలయం నిర్మాణానికి సంబంధించి భూమి పూజను ప్రధాని మోదీ చేసిన విషయం విదితమే.

అత్యంత మురికి వ్యక్తి మృతి

టెహ్రాన్: కొన్ని దశాబ్దాలుగా స్నానం చేయనందుకు 'ప్రపంచంలోనే అత్యంత మురికివాడి'గా మారుపేరుతో పిలవబడే ఇరాన్‌లోని ఒక వ్యక్తి (94) మరణించినట్లు ఇరాన్ ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. అర్థశతాబ్ద కాలం నుంచి స్నానం చేయకుండా ఉన్న అమౌహాజీ... దక్షిణ రాష్ట్రం ఫార్స్‌లోని డెజ్‌గాహ్ గ్రామంలో మృతి చెందినట్లు ఇరాన్ వార్తాసంస్థ తెలిపింది.

జబ్బు చేస్తుందేమోనని హాజీ స్నానం చేయకుండా ఉండిపోయాడని స్థానిక అధికారి చెప్పినట్లు వార్తాసంస్థ వెల్లడించింది. కొన్ని నెలల కిందట మొదటిసారి హాజీని గ్రామస్తులు స్నానాల గదికి తీసుకెళ్లినట్లు పేర్కొంది. 'అమౌహాజీ విచిత్ర జీవితం' అనే డాక్యుమెంటరీ సంక్షిప్త చిత్రాన్ని 2013లో ఆయన జీవితంపై తీసినట్లు ఇరాన్ మీడియా కేంద్రాలు వెల్లడించాయి.

కేరళ హైకోర్టులో ఊరట

(మొదటిపేజీ తరువాయి)

స్పందించాలని వీసీలను ఆదేశించింది. ఇదిలా ఉండగా, వీసీలు సోమవారం సాయంత్రం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి హైకోర్టును ఆశ్రయించారు. రాజీనామా చేయమని చెప్పినా వినకపోవడంతో సహజ న్యాయ తిరస్కరణ జరిగిందని పిటిషనర్లు వాదించారు. అయితే న్యాయస్థానం మధ్యంతర ఉపశమనం కల్పిస్తూ, గవర్నర్ వీసీలందరికీ నోటీసులు అందించినందున, వారి రాజీనామాలను కోరుతూ గతంలో ఆయన రాసిన లేఖ ఔచిత్యం లేకుండా పోయిందని పేర్కొంది. గవర్నర్ జారీ చేసిన షోకాజ్ నోటీసు ప్రకారం ఆయన తుది ఆదేశాలు జారీ చేసే వరకు వీసీలు తమ పదవుల్లో కొనసాగవచ్చునని తెలిపింది. గవర్నర్ మొదట ఈ తొమ్మిది మంది వీసీలకు ఇచ్చిన షోకాజ్ నోటీసుల్లో సోమవారం ఉదయం 11.30 గంటలకల్లా పదవుల నుంచి వైదొలగాలని ఆదేశించారు. అయితే వీరంతా హైకోర్టును ఆశ్రయించిన తర్వాత గవర్నర్ మరొక నోటీసును జారీ చేశారు. విశ్వవిద్యాలయాల ఉప కులపతులుగా కొనసాగేందుకుగల చట్టబద్ధమైన హక్కును వివరిస్తూ నవంబరు 3 సాయంత్రం ఐదు గంటల్లోగా సమాధానాలు సమర్పించాలని ఆదేశించారు. సమాధానాలు ఇవ్వడంలో విఫలమైతే, ఈ నియామకాలు చెల్లనివిగా, చట్టవిరుద్ధమైనవిగా పరిగణిస్తామని తెలిపారు. కాగా పాలక్కాడ్‌లో మీడియా ప్రతినిధులతో విజయన్ మాట్లాడుతూ 'తొమ్మిది మంది వీసీల నియామకం చట్టవిరుద్ధమని గవర్నర్ గుర్తిస్తే, దానికి ఆయనే బాధ్యత వహిస్తారు. వీసీలను నియమించే అధికారి గవర్నర్. అక్రమ నియామకాలు జరిగితే ఆయనదే బాధ్యత. ఎవరు నిష్క్రమించాలో గవర్నర్‌ను ఆలోచించనివ్వండి... ఆయన లేదా వీసీలా. సంఘ్ పరివార్ ఆదేశాల మేరకు గవర్నర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. విధ్వంసకర మనస్తత్వంతో వ్యవహరిస్తున్నాడు' అని తెలిపారు. గవర్నర్ కార్యాలయం ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చేందుకు ఉద్దేశించినది కాదని విజయన్ అన్నారు. నవంబర్ 15న రాజ్‌భవన్ ముందు ఎల్‌డీఎఫ్ ప్రతిపాదిత ఆందోళనను ప్రస్తావిస్తూ 'రాజ్యాంగ సంస్థకు అనుకూలమైన పనులు జరిగినప్పుడు, నిరసనలు తలెత్తుతాయని విజయన్ హెచ్చరించారు.

రెండు గంటలు పనిచేయని వాట్సాప్

సమస్యను పరిష్కరించి సేవల్ని పునరుద్ధరించాం: మెటా

న్యూఢిల్లీ: ప్రముఖ సామాజిక మాధ్యమం వాట్సాప్ సేవలు కొద్దిసేపు నిలిచిపోయాయి. దాదాపు రెండు గంటల పాటు వాట్సాప్ పనిచేయకపోవడంతో ప్రపంచవ్యాప్తంగా వినియోగదారులకు ఆగ్రహించారు. బ్రిటన్ నుంచి భారత్‌కు సందేశాలు పంపుకోవడం కుదరలేదు. కాగా, మెసేజింగ్ యాప్‌లో చిన్నపాటి సమస్య కారణంగా ఇలా జరిగిందని, దానిని సరిచేసి సేవలను పునరుద్ధరించామని మెటా ప్రకటించింది. మెటా కంపెనీ అధికార ప్రతినిధి స్పందిస్తూ 'ఈరోజు వాట్సాప్ సేవలు కొద్దిసేపు నిలిచిపోయాయి. సందేశాలు పంపుకోవడం కుదరలేదు. సమస్యను పరిష్కరించి సేవలను పునరుద్ధరించాం' అని చెప్పారు. అంతరాయానికి కారణమేమిటో తెలుపలేదు. 'ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో వాట్సాప్ పనిచేయలేదు. ఆసియా, బ్రిటన్, దక్షిణాఫ్రికా, యూరప్ దేశాల్లో సేవలకు అంతరాయం కలిగింది. వాట్సాప్ వెబ్ కూడా పనిచేయలేదు' అని డౌన్‌డిటెక్టర్ వెబ్‌సైట్ పేర్కొంది. భారత్‌లో ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా వంటి ప్రధాన నగరాల వినియోగదారులు సైతం ఇబ్బందిపడ్డారు. ఒకదశలో 29వేలకుపైగా ఫిర్యాదులు వచ్చాయి అని డౌన్‌డిటెక్టర్ వెల్లడించింది.

నమో అంటే... నమ్మించి మోసం చేసేవాడు

ప్రధాని మోదీకి కేటీఆర్ బహిరంగ లేఖ

విశాలాంధ్ర-హైదరాబాద్: రోజ్‌గార్ మేళా పచ్చి దగా, ఇది యువతను మోసం చేయడమే నని మంత్రి కేటీఆర్ ఆరోపించారు. రోజ్‌గార్ మేళాపై ప్రధాని మోదీకి కేటీఆర్ మంగళవారం బహిరంగ లేఖ రాశారు. "నమో అంటే... నమ్మించి మోసం చేసేవాడని రుజువైందని పేర్కొన్నారు. ప్రతి ఎన్నికల ముందు యువతను మోసపుచ్చే ఇలాంటి ప్రచార కార్యక్రమాలను పక్కన పెట్టి నిబద్ధతతో నిరుద్యోగ సమస్యపైన దృష్టి సారించాలని సూచించారు. హిమాచల్, గుజరాత్ ఎన్నికల ముందర మోదీ మరో కొత్త డ్రామాకు తెరలేపారన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు అన్నారు... మరి 8 ఏళ్లలో 16 కోట్ల ఉద్యోగాలు ఇచ్చారా అని ప్రశ్నలు సంధించారు. ఉద్యోగాల భర్తీపై బీజేపీ శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఒక రాష్ట్రంగా 2,24,000 ప్రభుత్వ ఉద్యోగాలు, సుమారు 16.5 లక్షల ఉద్యోగ, ఉపాధి అవకాశాలను ప్రయివేట్ రంగంలో కల్పిస్తున్నప్పుడు, ఒక కేంద్ర ప్రభుత్వంగా మీరు దేశ వ్యాప్తంగా ఎన్ని ఉద్యోగాలివ్వాల్సి ఉంటుందని ప్రశ్నించారు. ఏటా 50 వేల ఉద్యోగాలను కూడా భర్తీ చేయని మీరు, రోజ్ గార్ మేళా పేరుతో కేవలం 75 వేల మందికి నియామక పత్రాల అందజేయడాన్ని నిరుద్యోగులు గమనిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతిసారి మాదిరే ఈసారి కూడా యువతను ఉద్యోగాల పేరుతో మోసం చేస్తే మీ పాలనపైన, ప్రభుత్వంపైన తిరగబడే రోజు త్వరలోనే వస్తుందని కేటీఆర్ హెచ్చరించారు.

ఉక్రెయిన్‌లో జర్మనీ అధ్యక్షుడి పర్యటన

బెర్లిన్ : జర్మనీ అధ్యక్షుడు ఫ్రాంక్-వాల్టర్ స్టీన్‌మీర్ మంగళవారం ఉక్రెయిన్ రాజధాని కీవ్ చేరుకున్నారని ఉక్రెయిన్‌లో ఆ యన ఆకస్మిక పర్యటనను ధృవీకరిస్తూ ఆయన అధికార ప్రతినిధి ఏఎఫ్‌పీకి చెప్పారు. ఫిబ్రవరిలో రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తరువాత ఫ్రాంక్ వాల్టర్ ఉక్రెయిన్ పర్యటన ఇదే మొదటిసారి.

"ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమీర్ జెలెన్‌స్కీతో కీవ్‌లో సమావేశానికి నేను ఎదురుచూస్తున్నాను" అని ఫ్రాంక్-వాల్టర్ అన్నట్లు ఆయన ప్రతినిధి ధృవీకరించారు. జెలెన్‌స్కీతో సమావేశానికి ముందుగా జర్మనీ అధ్యక్షుడు రష్యా బలగాలనుండి విముక్తి చేసినట్లు ఉక్రెయిన్ చెబుతున్న బెలారస్ సరిహద్దులో దేశానికి ఉత్తరాన వున్న ఒక పట్టణాన్ని సందర్శిస్తారు. విద్యుత్ మౌలిక సౌకర్యాలకు ఆ పట్టణ మున్సిపాలిటీకి ఆర్థిక సహాయం సమకూరుస్తారని ఆయన ప్రతినిధి తెలిపారు. మీరు జర్మనీని విశ్వసించవచ్చని ఉక్రెయిన్ ప్రజలకు ఫ్రాంక్-వాల్టర్ సందేశమిచ్చారు.

తీవ్ర నిరాశలో యువత

(మొదటిపేజీ తరువాయి)

చేరికలో 8 శాతం క్షీణతతో 14.6 లక్షలకు తగ్గింది. అదేవిధంగా జాతీయ పింఛను పథకం (ఎన్‌పీఎస్) కూడా ఏప్రిల్‌లో 64,569, మేలో 60,926, జూన్‌లో 58,425, జులైలో 66,014తో పోలిస్తే 0.71 శాతం స్వల్పంగా తగ్గి 65,543 వద్ద ఉంది. సంవత్సరానికి సంవత్సరానికి పోల్చినప్పటికీ, మహమ్మారి రెండవ తరంగం విరామం ఆగస్టు 2021తో పోల్చితే ఈ 12 నెలల్లో సృష్టించబడిన అధికారిక ఉద్యోగాలలో పెరుగుదలను ప్రదర్శిస్తుంది. ఈ 12 నెలల్లో ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ క్రింద సృష్టించబడిన అధికారిక ఉద్యోగాలు ఆగస్టు 2021లో జోడించిన 14.8 లక్షలతో పోల్చితే 14.4 శాతం పెరిగాయి. ఆగస్టు 2021లో ఈఎస్‌ఐసీ కంటే తక్కువ నికర కొత్త చందాదారుల చేరిక చివరి ఆగస్టులో 13.2 లక్షల కొత్త చందారుల కంటే 10.5 శాతం ఎక్కువగా ఉంది. ఆగస్టు 2021లో 56,827 కొత్త నమోదులకుగాను జాతీయ పింఛను పథకం 16.3 శాతం పెరిగింది. నెలలో మొత్తం 16.9 లక్షల ఇంటర్‌నెట్ చందాదారులలో దాదాపు 9.8 లక్షల కొత్త సభ్యులు ఈపీఎఫ్-ఎంపీ చట్టం-1952 సామాజిక భద్రతా కౌల్ క్రింద ప్రాథమిక సమయం కోసం నమోదయినట్లు పేర్కొంది. దాదాపు 7.1 లక్షల ఇంటర్‌నెట్ చందారులు నిష్క్రమించారు. నివేదిక ప్రకారం, ఆగస్టులో 11.8 లక్షల మంది పురుషులు ఈఎస్‌ఐసీలో చేరారు. అయితే 2.8 లక్షల స్త్రీలు చందాదారులుగా చేరారు. జాతీయ పింఛను పథకం కింద చేరిన ఉత్తమ రకాల చందారులు రాష్ట్ర అధికారుల డిగ్రీలో 40,902 వద్ద, కంపెనీ రంగంలో 15,502 వద్ద ఉన్నారు. కేంద్ర అధికారులు 9,139 వద్ద అతి తక్కువగా చేరారు. ఎన్ఎస్‌వో అదనంగా అధికారిక రంగంలో ఉపాధి స్థాయిలపై నివేదిక పూర్తిగా భిన్నమైన అభిప్రాయాలను అందిస్తుంది. సంపూర్ణ డిగ్రీతో ఉపాధిని కొలవదు.

ఫీజు నియంత్రణ ఎక్కడ?

(మొదటిపేజీ తరువాయి)

కల్పించిన అన్ని రకాల సౌకర్యాలు పొందుతూ పదవులు అనుభవిస్తున్నారుగానీ, పర్యవేక్షణకు ముందుకు వెళ్లకపోవడం పై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ చట్టాల అమలుకు అధికారులు సైతం ఎవరూ ముందుకు రావడం లేదు.

అనుమతుల్లేకుండా కార్పొరేట్ కళాశాలలు

ఇంటర్మీడియట్ బోర్డు అనుమతులు లేకుండా పుట్టగొడుగుల్లా కార్పొరేట్ విద్యా సంస్థలు జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేస్తున్నాయి. బోర్డు నిబంధనలకు వ్యతిరేకంగా లక్షల రూపాయల ఫీజుల దోపిడీ చేస్తున్నాయి. బోర్డు పాఠ్యాంశాలను బోధించకుండా ఇంటర్ మొదటి సంవత్సరం నుంచే జేఈఈ-మెయిన్స్, అడ్వాన్స్, ఎంసెట్, నీట్ కోచింగ్ కేంద్రాలను నడుపుతున్నారు. అర్హతలేని అధ్యాపకులతో బోధన కొనసాగిస్తున్నారు. అపార్టుమెంట్లు, దుకాణాల సముదాయాల్లో కళాశాలలను ఏర్పాటు చేసినప్పటికీ, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిషన్లు నిద్రావస్థలో ఉన్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటర్ ప్రవేశాల్లో రిజర్వేషన్లు అమలు చేయకపోవడం, కేవలం ఎంపీసీ, బైపీసీ గ్రూపులనే నడపడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. ఎంపీసీ, బైపీసీకి రకరకాల పేర్లతో జేఈఈ, నీట్ కోచింగ్ ఇస్తూ, లక్షలాది రూపాయల ఫీజును దోచుకుంటున్నారు. ఒకే గ్రూపును వివిధ రకాల పేర్లతో నిర్వహించడం వల్ల విద్యార్థుల మధ్య వివక్షత, వ్యత్యాసాలు వస్తున్నాయని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పేరొందిన కార్పొరేట్ కళాశాలలు ఇదే విధానాన్ని అవలంభిస్తూ, విద్యను వ్యాపారమయం చేస్తున్నాయి.

175 కళాశాలల రద్దు అమలయ్యేనా?

రాష్ట్రంలోని 175 ప్రైవేటు జూనియర్ కళాశాలల అనుమతులు రద్దు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఎంత వరకు అమలవుతుందనేదీ ప్రశ్నార్థకంగా మారింది. గతంలో విజయవాడ బెంజిసర్కిల్ దగ్గర కార్పొరేట్ జూనియర్ కళాశాలకు అనుమతులు రద్దు చేసినప్పటికీ, అధికారులతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుని, దానిని యథాతథంగా నడుపుతున్నారనే విమర్శలున్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్నత విద్యా ప్రమాణాలతో విద్య, జేఈఈ, నీట్ పోటీ పరీక్షలకు శిక్షణావకాశాలు లేనందునే... విద్యార్థులు, తల్లిదండ్రులు కార్పొరేట్ కళాశాలల వైపు చూస్తున్నారనే వాదనలున్నాయి. దీంతో ప్రభుత్వ కళాశాలల్లో మౌలిక సదుపాయాలతో పాటు జేఈఈ, నీట్, ఎంసెట్ పోటీ పరీక్షలకు ఉన్నతమైన శిక్షణ అందించేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాల్సి ఉంది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం చట్టపరమైన, న్యాయపరమైన విధానంతో ముందుకెళ్లాలి. విద్య పేరుతో దోపిడీ చేస్తున్న విద్యా వ్యాపారుల అక్రమాలను అరికట్టాల్సి ఉంది. ఇప్పటికైనా సీఎం జగన్ స్పందించి పాఠశాల, ఉన్నత విద్య ఫీజు నియంత్రణ కమిషన్ల కార్యకలాపాలు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ది ఆంధ్రప్రదేశ్ స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్

(గవర్నమెంట్ పార్టనరేడ్ షెడ్యూల్డ్ బ్యాంక్)

27-29-28, ఎన్.టి.ఆర్. సహకార భవన్, గవర్నర్ పేట, విజయవాడ-520002, ఫోన్ నెం.0866-2429080, 7729993171

APCOB

బంగారు నగల వేలం నోటీసు

ఈ దిగువ పట్టికలో పేర్కొనబడిన వ్యక్తులు మా వద్ద బంగారు నగలు తాకట్టు పెట్టి అప్పు తీసుకొనియున్నారు. సదరు బాకీలు సకాలంలో చెల్లించనందున వాటి బకాయిలు పూర్తిగా చెల్లించి నగలు విడిపించుకొనవలసిందిగా మా వద్ద గల వారి చిరునామాలకు పలుమార్లు నోటిసులు పంపించినాము. సదరు బకాయిలు చెల్లించనందున **ది : 31.10.2022 (సోమవారం) మధ్యాహ్నం 04 : 00 గంటలకు మా బ్యాంకు (ప్రధాన కార్యాలయ)** ఆవరణలో మా వద్ద తాకట్టులో ఉన్న బంగారు ఆభరణములను వేలం వేసి బకాయిలను జమచేయబడును. ఇంకనూ ఏమైనా బాకీ మిగిలి ఉన్నయెడల చట్టరీత్యా బాకీదారుల నుండి వసూలు చేయబడును. ఆసక్తి ఉన్న వారు వేలములో పాల్గొనవచ్చును. వేలములో పాల్గొనువారు రూ.10 వేలు (E.M.D) ధరావత్తు సొమ్ము కట్టవలెను. ఎట్టి కారణము చూపకనే వేలమును నిలిపివేయుటకుగాని, వేలములో ఎక్కువ ధరకు పాడిన ధరను (Highest Bid) ఆఫరు తిరస్కరించుటకుగాని సర్వహక్కులు బ్యాంకు వారికి ఉన్నవి. వేలములో వస్తువులు పాడుకున్నవారు నగదు వెంటనే చెల్లించవలెను. మరింత సమాచారం కొరకు AGM (BRCC), APCOB వారిని సంప్రదించగలరు.

లోన్ ఖాతా నెం.	ఖాతాదారుని పేరు, చిరునామా	మొత్తము బరువు గ్రాములలో
110000255149	కె కె ఎస్ రాంప్రసాద్, డి.నెం.21-10/8-12, శ్రీ నగర్ కాలనీ, 6వ లైను, ముత్యాలంపాడు, విజయవాడ-11	102.50

తేది : 25.10.2022

స్థలం : విజయవాడ

సం/-

అసిస్టెంట్ జనరల్ మేనేజర్

చేతల మనిషిని

(మొదటిపేజీ తరువాయి)

అంతర్గత కుమ్ములాటల దృష్ట్యా పార్టీని ఐక్యం చేయవలసిన బృహత్తర కర్తవ్యాన్ని కూడా ఆయన ఎదుర్కొంటున్నారు. ఐక్యతపై 'ఆఖరి అవకాశ వేదిక" గా వుందని థెరీసామే, జాన్సన్ టోరీ ప్రభుత్వాలలో మంత్రిగా పనిచేసిన గవిన్ విలియంసన్ అన్నారు. నేడు పార్లమెంటులో 'ప్రధానమంత్రి ప్రశ్నల" మొదటి సమావేశాన్ని ఎదుర్కోటానికి ముందుగానే తన మంత్రివర్గ బృందాన్ని నియమించటం సునాక్ ప్రారంభిస్తారు. సునాక్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ రానున్న కాలంలో కఠినమైన నిర్ణయాలు తీసుకోనున్నట్లు చెప్పారు. 'కోవిడ్ సమయంలో ప్రజలను, వాణిజ్యవేత్తలను రక్షించేందుకు నేను చేయగలిగిన ప్రతిదీ చేయడాన్ని మీరు చూశారు. ఇంతకు ముందెన్నడూ లేని విధంగా ఇప్పుడు పరిమితులు వున్నాయి. నేడు ఎదుర్కొంటున్న సవాళ్ళను దయార్ద్ర హృదయంతోనే పరిష్కరిస్తానని వాగ్దానం చేస్తున్నాను. నేను నేతృత్వం వహించే ప్రభుత్వ రుణాన్ని భవిష్యత్ తరానికి, మీ పిల్లలకు, మనవళ్లకు విడిచిపెట్టకుండా పరిష్కరించడానికి కృషి చేస్తాను.

పునరుజ్జీవనం

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటులో నిమగ్నమయ్యారు. 1930లలో ప్రపంచాన్ని కల్లోలపరిచిన మహామాంద్యం అనంతరం అనేక దశాబ్దాల తర్వాత అత్యంత వేగంగా యూనియన్లు ఏర్పాటు కావడం విశేషం. 2021 తర్వాత యూనియన్ల ఏర్పాటు ప్రక్రియ 58 శాతం పెరిగింది. ఆధునిక కాలంలో స్థాపిస్తున్న నూతన సంస్థల్లో పనిచేస్తున్న వారే యూనియన్ల ఏర్పాటుకు ప్రధానంగా ముందుకు వస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో న్యూయార్క్ పరిధిలోని స్టాటెన్ దీవిలో అతిపెద్ద అమెజాన్ గిడ్డంగిలో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులు యూనియన్ ఏర్పాటు చేసుకోవడంతో కార్పొరేట్ బాస్‌లు కళ్లుతెరుచుకొని సమావేశమై ఈ పరిణామాలను చర్చించారు.

ఇప్పుడెందుకు ఈ పరిణామం: కాలేజీల్లో చదువుకుంటూ వివిధ సంస్థల్లో పనిచేస్తున్న వారు యజమానులు అపారంగా లాభాలు పొందుతూ, తమకు అతి తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారని గ్రహించి యూనియన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఉన్నత విద్య చదువుతున్న వారు తమకు ఇంత తక్కువ వేతనాలివ్వడం ఏమిటని ఆగ్రహం చెందుతున్నారు. కోవిడ్-19 మహమ్మారి కూడా పని చేస్తున్న వారిలో అభద్రతకు దారితీసింది. కంపెనీల యజమానులు రోజు రోజుకూ అపార సంపన్నులవుతూ, అతి తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారని, దిగువ తరగతి పనిచేస్తున్న వారు తిరుగుబాటుకు సిద్ధమవుతున్నారని వివిధ అధ్యయనాలు వెల్లడించాయి. కోవిడ్ కాలంలో భద్రతా సౌకర్యాలు, కనీసం మాస్కులు కూడా కల్పించలేదని అమెజాన్ గిడ్డంగిలో కార్మికులంతా వాకౌట్ చేశారు. ఉన్నత విద్యాలయాల్లో విద్యార్థులు మంచి వేతనాలు, గౌరవం, అవసరమైన ఆరోగ్య సౌకర్యాలు కల్పించడం లేదని నిరసన వ్యక్తం చేస్తున్నారు. కోవిడ్ మహమ్మారి కాలంలో వేలాది మందిని పనుల నుంచి తొలగించడం, తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకున్న తర్వాత తక్కువ వేతనాలివ్వడంపై ఆగ్రహం చెందుతున్నారని సిటీ యూనివర్సిటీ ఆఫ్ న్యూయార్క్‌లో పని చేస్తున్న కార్మికవర్గంపై అధ్యయనం చేస్తున్న రత్‌మిల్క్‌మని తెలిపారు. 1970 తర్వాత అమెరికాలో ఉత్పాదకత అపారంగా పెరిగినప్పటికీ వేతనాలు పెద్దగా పెరగలేదు. ప్రభుత్వం అమలుచేస్తున్న విధానాలే ఇందుకు కారణం. 1979-2021 మధ్య కాలంలో గంటకు ఆర్థికపరంగా ఆదాయం 62.5 శాతం పెరగగా, వేతనాలు మాత్రం 15.9 శాతం మాత్రమే పెరిగాయని అధికారిక గణాంకాలు తెలుపుతున్నాయి. ఈ దుస్థితికి విధానపరమైన నిర్ణయాలే కారణం. యూనియన్ల ఏర్పాటు ద్వారానే వేతనాలు, హక్కులు సాధించుకోవచ్చన్న అభిప్రాయాన్ని కార్మికులు, ఉద్యోగులు వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా ఉద్యమాలకు అంకితమవ్వాలి

వంక వర్ధంతి సభలో డీవీవీఎస్ వర్మ

విశాలాంధ్ర-తణుకు: ప్రజా పోరాటాల ద్వారా కమ్యూనిస్టు ఉద్యమ వ్యాప్తికి వంక సత్యనారాయణ జీవితాంతం కృషి చేశారని మార్క్సిస్టు మేధావి డీవీవీయస్ వర్మ అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, సీపీఐ మాజీ శాసనసభ్యులు వంక సత్యనారాయణ 4వ వర్ధంతి సభ మంగళవారం పశ్చిమగోదావరి జిల్లా తణుకు వంక సత్యనారాయణ సురాజ్య భవన్ భూపతిరాజు సుబ్బరాజు సమావేశ హాలులో జరిగింది. వర్ధంతి సభకు సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అధ్యక్షత వహించారు. 'ప్రజా ఉద్యమాలు-వామపక్షాల పాత్ర' అనే అంశంపై వర్మ స్మారకోపన్యాసం చేశారు. కమ్యూనిస్టు ఉద్యమ తొలితరం నేతగా వంక అణగారిన, అట్టడుగు వర్గాల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశారని, దీని ద్వారా ద్వారా కమ్యూనిస్టు ఉద్యమ వ్యాప్తికి పూనుకున్నారని వర్మ చెప్పారు. ప్రజా మద్దతుతో శాసనసభ్యునిగా ఎన్నికయ్యారన్నారు. అసమానతలు లేని...దోపిడీ రహిత సమాజ నిర్మాణమే ధ్యేయంగా పనిచేసి కమ్యూనిస్టు పార్టీని ప్రజల పార్టీగా నిర్మించారన్నారు. బలమైన ప్రజా పోరాటాల కారణంగా జిల్లా నుంచి అనేక మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎన్నికయ్యారన్నారు. ఆనాటి రాజకీయ పరిస్థితులు, ప్రజావసరాల కనుగుణంగా ఉద్యమించడం వలననే ఇది సాధ్యమయిందన్నారు. నేటి రాజకీయ పరిస్థితులు, ప్రజావసరాలకనుగుణంగా ప్రజా పోరాటాలు రూపొందించుకోవాలన్నారు. దేశంలో 90 శాతం సంపద కేవలం 10 శాతం మంది చేతిలో ఉందని, సంపద సృష్టికర్తలు, శ్రమ జీవులు కనీస అవసరాలు తీరక పేదరికంలో మగ్గుతున్నారన్నారు. విద్యావేత్త, రాష్ట్ర శెట్టి బలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య మాట్లాడుతూ పెనుగొండలో, అత్తిలిలో కళాశాలలు ఏర్పాటు చేసి విద్యారంగం అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన వంక ఆదర్శప్రాయుడన్నారు. రైతాంగ సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం, అట్టడుగు వర్గాల ఉన్నతికి వంక జీవితాంతం కృషి చేశారన్నారు. చిన్న వయస్సు నుంచే వంక పోరాటాలు తమను ఎంతగానో ప్రభావితం చేశాయన్నారు. ఆ స్ఫూర్తితోనే తమ కుటుంబం ముందుకెళుతోందన్నారు.

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేగా ప్రభాకర్, సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, వంక సత్యనారాయణ జీవిత భాగస్వామి వంక నాగమణి, డాక్టర్ వంక రామదాస్, వంక మోహన్, అద్దాల అరుణ రేఖ, అద్దాల వీరభద్రరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ వంక రాజకుమారి, డాక్టర్ వంక వసుంధర, సామాజికవేత్త సంకు మనోరమ, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కలిశెట్టి వెంకట్రావు, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి, సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, ఏరియా కన్వీనర్ టి.అప్పలస్వామి తదితరులు మాట్లాడారు. తొలుత వంక సత్యనారాయణ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజానాట్యమండలి గాయకులు సయ్యపురెడ్డి బాబ్జీ, రంగినీడి ఆదినారాయణ, గిద్దా సూర్యనారాయణ, ఎం.సీతారాం ప్రసాద్, అద్దాల సత్యనారాయణ, నామాన వెంకటేశ్వరరావు అభ్యుదయ గేయాలు ఆలపించారు.

రేపు నెల్లూరు జిల్లాలో సీఎం పర్యటన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీఎం జగన్ ఈనెల 27న నెల్లూరు జిల్లాలో పర్యటించనున్నారు. ముత్తుకూరు మండలం నేలటూరులో ఏపీజెన్‌కో ప్రాజెక్ట్ మూడో యూనిట్ (800 మెగావాట్లు)ను సీఎం జాతికి అంకితం చేస్తారు. గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి గురువారం ఉదయం 9.30 గంటలకు బయలుదేరి, 10.55కు కృష్ణపట్నంకు చేరుకుంటారు. 11.10 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి నేలటూరు చేరుకుని ఏపీజెన్‌కో ప్రాజెక్ట్ మూడో యూనిట్ (800 మెగావాట్లు)ను సీఎం జగన్ జాతికి అంకితం చేయనున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. తిరిగి సాయంత్రం 3.30 గంటలకు తాడేపల్లి నివాసానికి సీఎం చేరుకుంటారు.

30 నుంచి ఏపీ పీజీసెట్ వెబ్ ఆప్షన్లు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, వాటి అనుబంధ ఎయిడెడ్, నాన్-ఎయిడెడ్ కళాశాలల్లో 2022-23 విద్యా సంవత్సరానికిగాను పీజీ కోర్సులకు (ఎం.ఏ, ఎం.కామ్, ఎమ్మెస్సీ, ఎంసీజే, ఎంఈడీ, ఎంపీఈడీ, ఎంఎస్-టెక్, ఎంఎల్ఐఎస్సీ) ఈనెల 30 నుంచి నవంబరు 3 వరకు వెబ్ ఆప్షన్లు స్వీకరిస్తారు. 3న వెబ్ ఆప్షన్ల చేర్పులు, మార్పులకు అవకాశమిస్తారు. 5న ఏపీపీజీసెట్-2022 ర్యాంకులు, రిజర్వేషన్ల ఆధారంగా సీట్లు కేటాయిస్తారు. సీట్లు పొందిన అభ్యర్థులు ఆయా కళాశాలల్లో 7 నుంచి 11వ తేదీ మధ్య రిపోర్టు చేయాలి. 9వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని ఏపీ పీజీసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ వై.నజీర్ అహ్మద్ తెలిపారు.

సైనిక పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సైనిక పాఠశాలల్లో ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. 2023-24 విద్యా సంవత్సరానికి 6, 9 తరగతులలో చేరగోరు విద్యార్థులు ఆల్ ఇండియా సైనిక్ పాఠశాలల ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (ఏఐఎస్ఎస్ఈఈ-2023)కు దరఖాస్తులు పంపాల్సి ఉంటుంది. ఈ మేరకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్ఐఏ) మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. 6వ తరగతిలో ప్రవేశానికిగాను 2023 మార్చి 31 నాటికి 10 నుంచి 12 ఏళ్లలోపు, 9లో ప్రవేశానికి 13 నుంచి 15 ఏళ్లలోపు వయస్సు కలిగిన విద్యార్థులు అర్హులు. జనరల్ అభ్యర్థులు రూ.650, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.500 చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పూర్తి చేయాలి. నవంబర్ 30న దరఖాస్తులను స్వీకరిస్తారు. వచ్చే ఏడాది జనవరి 8న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ఏపీలో కోరుకొండ, కలికిరిలో సైనిక పాఠశాలలున్నాయి.

28న రాఘవాచారి స్మారక సభ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: విశాలాంధ్ర పూర్వ సంపాదకులు సి.రాఘవాచారి తృతీయ వర్ధంతి సభ ఈనెల 28వ తేదీ సాయంత్రం 6 గంటలకు విజయవాడ సిద్ధార్థ అకాడమిలో జరుగుతుంది. సి.రాఘవాచారి ట్రస్ట్ అధ్వర్యాన జరిగే ఈ స్మారక సభకు విశాలాంధ్ర సంపాదకులు ఆర్వీ రామారావు అధ్యక్షత వహించనుండగా '2047లో భారతదేశం-అమృత కాలంలో ఏమి ఆశించాలి' అనే అంశంపై ప్రముఖ పాత్రికేయులు, రచయిత, మానవహక్కుల కార్యకర్త ఆకార్ పటేల్ స్మారకోపన్యాసం చేస్తారు. అందరూ సకాలంలో సభకు హాజరు కావాలని ట్రస్ట్ నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

అది జగన్ కమిషన్

- స్త్రీల పరువు తీసేలా మహిళా కమిషన్ చర్యలు
- వంగలపూడి అనిత విమర్శ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో రోజుకు సగటున మహిళలపై 49 నేరాలు జరుగుతున్నాయంటే ఆడబిడ్డల రక్షణలో సీఎం జగన్ చిత్తశుద్ధి ఏపాటిదో అర్థం చేసుకోవచ్చని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు వంగలపూడి అనిత విమర్శించారు. మహిళల పరువు తీసేలా ఏపీ మహిళా కమిషన్ వ్యవహరిస్తోందని అన్నారు. మహిళల రక్షణ, వారికి న్యాయం కోసం దీనిని చంద్రబాబు ఏర్పాటు చేయగా అది ప్రస్తుతం 'జగన్ కమిషన్'గా మారిందని వ్యాఖ్యానించారు. జగన్ మూడున్నరేళ్ల పాలనలో 45వేలకుపైగా నేరాలు మహిళలపై జరిగాయన్నారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలోని దుశ్చర్యలు సాగుతున్నాయని, పోలీసుల నిర్లక్ష్యం వల్లే కడపజిల్లా బద్వేల్ మండలంలో అనూష చనిపోయిందని అన్నారు. జగన్ ఆర్భాటంగా చెప్పే జీరో ఎఫ్ఐఆర్ వ్యవస్థ ఆడబిడ్డల రక్షణకు కొరగాకుండా పోయింది. ఆయా ఘటనల్లో వలెంటీర్ల ప్రమేయం కూడా ఉంది. ఇన్ని దారుణాలు జరిగినా డీజీపీ స్పందించకపోవడం దారుణం. ఆడపిల్ల మానానికి రూ.5లక్షలు, ప్రాణానికి రూ.10 లక్షలు ఖరీదుకట్టే దుస్థితిలో మహిళా కమిషన్, జగన్‌రెడ్డి, హోంమంత్రి ఉన్నారు. సమయం, సందర్భం లేకుండా ఏది పడితే అది హోం మంత్రి మాట్లాడుతున్నారు' అని అనిత అన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కి నోటీసులు ఇవ్వడానికి మాత్రమే వాసిరెడ్డిపద్మకు సర్వాధికారాలుంటాయా? మహిళలకు న్యాయం చేయడానికి ఆమె అధికారాలు, హోదా పనికిరావా? అని ప్రశ్నించారు. కేబినెట్‌లో బూతులు మాట్లాడని మంత్రి ఉన్నారా? అని నిలదీశారు. ముఖ్యమంత్రి స్థానంలో ఉండి బహిరంగ సభలో నా వెంట్రుక కూడా పీకలేరని జగన్ మాట్లాడలేదా? వాసిరెడ్డి పద్మకు మహిళలపై గౌరవముంటే జగన్‌కే తొలి నోటీసు ఇవ్వాలని, రెండో నోటీసును బూతులు మాట్లాడే మాజీ మంత్రి, ప్రస్తుత మంత్రులకు ఇవ్వాలని అనిత డిమాండు చేశారు.

సీపీఐకి రూ.2 లక్షల విరాళం

విశాలాంధ్ర-తణుకు: సీపీఐ పశ్చిమగోదావరి జిల్లా ఉద్యమాభివృద్ధికి పార్టీ తణుకు పట్టణ సమితి రూ.2 లక్షల విరాళం అందజేసింది. ఈ మొత్తాన్ని సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావుకు అందజేశారు. తణుకు సీపీఐ కార్యాలయంలో మంగళవారం జరిగిన పార్టీ జిల్లా సమితి సమావేశంలో పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, కమిటీ సభ్యులు కోరాడ సుధీర్ బాబు, బొద్దాని కృష్ణ కిశోర్ తదితరులు పాల్గొన్నారు. సీపీఐ తణుకు పట్టణ సమితికి భీమారావు అభినందనలు తెలిపారు.

ఉత్తర కుమారుల రాజీనామాలు ఏవీ?

బహుజన జేఏసీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉత్తరాంధ్ర కోసం తమ పదవులకు రాజీనామాలు చేస్తామని ప్రగల్భాలు పలికిన ఉత్తర కుమారుల రాజీనామాలు ఏమయ్యాయంటూ అమరావతి బహుజన జేఏసీ అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య మంగళవారం ఓ ప్రకటనలో ప్రశ్నించారు. విశాఖ రాజధాని కోసం రాజీనామాలు చేస్తున్నామని ప్రకటించిన మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ రోజులు గడిచినా తమ పదవులకు స్పీకర్ చేత రాజీనామాలను ఎందుకు ఆమోదింప చేసుకోలేదన్నారు. ఉత్తరాంధ్రపై ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్న మంత్రులు బొత్స సత్యనారాయణ, సీదిరి అప్పలరాజు, ఆర్కే రోజా, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ తక్షణం తమ పదవులకు రాజీనామాలు చేసి ఉత్తరాంధ్ర గురించి మాట్లాడాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్, సాగునీటి ప్రాజెక్టులు, రైల్వే జోన్, ఋషికొండ, వెనుకబడ్డ ప్రాంతాల ప్రత్యేక ప్యాకేజీని తీసుకురావడం చేతగాక, తమ తప్పిదాలను, కప్పిపుచ్చుకునేందుకు రాజధాని మంటలు రేపుతున్నారని మండిపడ్డారు.

కార్యాచరణ దిశగా మూడు రాజధానులు

అది నకిలీ రైతుల పాదయాత్ర: బొత్స

విశాలాంధ్ర-విజయనగరం: మూడు రాజధానుల ఏర్పాటు కోసం కార్యాచరణ సిద్ధమవుతోందని రాష్ట్ర విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. ఆయన మంగళవారం కలెక్టరేట్‌లో మీడియాతో మాట్లాడుతూ విశాఖలో జరిగిన గర్జన సభకు లక్షలాదిమంది హాజరై విజయవంతం చేయడం ద్వారా మూడు రాజధానులపై ప్రజాభిప్రాయం తేటతెల్లమైందని అన్నారు. మూడు రాజధానుల ఏర్పాటు తథ్యమని, విశాఖపట్నం పరిపాలనా రాజధాని అవుతుందని మంత్రి స్పష్టం చేశారు. ఇప్పటివరకు నకిలీ రైతులతో అమరావతి పాదయాత్ర జరిగిందని చెప్పారు. 600 మంది రైతులకు కోర్టు అనుమతిచ్చినప్పటికీ, వారిలో కనీసం 60 మందికి కూడా గుర్తింపు కార్డులు లేవని అన్నారు. అది రైతుల ముసుగులో టీడీపీ నాయకులు చేసిన పాదయాత్ర అని విమర్శించారు. అందుకే ఆ నకిలీ పాదయాత్ర ఆగిపోయిందన్నారు. విశాఖ రాజధాని అయితే ఉత్తరాంధ్ర సహా రాష్ట్రం బాగుపడుతుందని, దీనికి అందరూ సహకరించాలని కోరారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి, కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి నవంబరులో ప్రధానమంత్రితో శంకుస్థాపనకు ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి బొత్స వెల్లడించారు. మంత్రితోపాటు ఎంఎల్ఏ బొత్స అప్పల నరసయ్య ఉన్నారు.

విశాఖ ఉక్కును ప్రైవేటుపరం కానీయం

621వ రోజుకు రిలే నిరాహార దీక్షలు

విశాలాంధ్ర-కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటు పరం కానివ్వబోమని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, నాయకులు జె.రామకృష్ణ, వరసాల శ్రీనివాసరావు, ఎన్.రామారావు, గుమ్మడి నరేంద్ర అన్నారు. పోరాట కమిటీ అధ్వర్యంలో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ కు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి లో చేపట్టిన రిలే దీక్షలు మంగళవారం 621 వ రోజుకు చేరుకున్నాయి. బి.ఎఫ్. విభాగ కార్మికులు దీక్షలో పాల్గొన్నారు. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ... లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి, జీవనోపాధిని కల్పిస్తున్న కర్మాగారాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఉక్కు కర్మాగారాన్ని కాపాడు కోవడానికి ఉద్యమాన్ని తీవ్రతరం చేయాల్సిన అవసరం ఉందన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని రాష్ట్ర ఎంపీలంతా పార్లమెంట్ లో గళమెత్తాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను సమైక్యంగా ఎదుర్కోవడం కోసం కార్మిక వర్గాన్ని సమాయత్తం చేయాలని అన్నారు. ఈ దీక్షల్లో బి.ఎఫ్. విభాగానికి బాబా, చందూర్, టి.ఈశ్వరరావు, రవికిరణ్, నగేశ్, ఎమ్. అప్పారావు, ఆర్.వెంకట్రావు, శ్రీనివాస రాజు, విజయ కుమార్, డి.శ్రీనివాసు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

'కులం-మతం' రాజకీయం చేసేవారిని చెప్పుతో కొట్టండి

నారా లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: కులం, మతం పేరుతో రాజకీయం చేసే వారిని చెప్పుతో కొట్టాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మంగళవారం ట్విట్టర్ ద్వారా పిలుపునిచ్చారు. టీడీపీ ఎమ్మెల్యే, తన మామయ్య నందమూరి బాలకృష్ణ తాజా చిత్రానికి వీర సింహారెడ్డి అనే పేరు నిర్ణయించిన క్రమంలో చిరంజీవి సినిమాలతో ఆయన చిత్రాలను పోలుస్తూ సామాజిక మాధ్యమాల్లో కొందరు వ్యాఖ్యలు చేస్తున్నారు. బాలకృష్ణ సినిమాలు అణగారినవర్గాలను కించపరిచేలా ఉన్నాయని టీడీపీకి చెందినదిగా భావిస్తున్న ట్విట్టర్ ఖాతా మీద ట్వీట్ వచ్చింది. దీనిని చూసిన లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఇది ఫేక్ పోస్టు అని, ఇలాంటివి చేసేది వైసీపీయే'నని విమర్శించారు. అదే ఆరోపణతో సీఎం జగన్ మోహన్ రెడ్డిని ఉద్దేశించి ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'ప్యాలస్ పిల్లి చీప్ ట్రిక్స్! కులాల మధ్య చిచ్చు పెట్టడానికి ఐప్యాక్ గ్యాంగ్స్, పేటీఎం డాగ్స్ రంగంలోకి దిగాయి. తస్మాత్ జాగ్రత్త! కులం, మతం పేరు చెప్పి రాజకీయం చేసే వారిని చెప్పుతో కొట్టండి. ఫేక్ అకౌంట్లు, ఫేక్ ట్వీట్స్ నీకు ఆత్మసంతృప్తిని ఇస్తాయేమోగానీ నిన్ను ఓటమి నుంచి తప్పించలేవు జగన్‌రెడ్డి' అని లోకేశ్ పేర్కొన్నారు.

వివేకా హంతకులతో ప్రభుత్వం కుమ్మక్కు

టీడీపీ ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైఎస్ వివేకానందరెడ్డిని చంపిన హంతకులతో రాష్ట్ర ప్రభుత్వం కుమ్మక్కైందని, సుప్రీంకోర్టులో దాఖలైన అఫిడవిట్‌కు సీఎం జగన్ నైతిక బాధ్యత వహిస్తూ తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని టీడీపీ ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు డిమాండ్ చేశారు. మంగళగిరి టీడీపీ జాతీయ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వివేకా హత్యకేసు నిందితులతో ప్రభుత్వం కుమ్మక్కైందని అనడానికి సీఎం వైఖరి, సీబీఐ అఫిడవిట్‌లోని అంశాలే నిదర్శనమన్నారు. సొంత బాబాయ్ హత్యపై గతంలో అసెంబ్లీలో రెండుకళ్ల సిద్ధాంతాన్ని వల్లెవేసిన జగన్, తాజాగా సుప్రీంకోర్టులో సీబీఐ దాఖలుచేసిన అఫిడవిట్‌పై ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. వివేకానందరెడ్డి హత్యపై నాడు చంద్రబాబు, ఆయన కుటుంబంపై, టీడీపీ ప్రభుత్వంపై హత్యారోపణలు చేసిన జగన్, నేడు ఏ ముఖం పెట్టుకుని సీఎం కుర్చీలో కూర్చున్నారంటూ నిలదీశారు. విచారణ సంస్థ సీబీఐ, ఏపీ పోలీసులు హత్యకేసు నిందితులను రక్షించడానికి పాటుపడుతున్నారనడం దేనికి సంకేతమో జగన్ చెప్పాలని అన్నారు. జగన్, సీబీఐ సుప్రీంకోర్టులో దాఖలుచేసిన అఫిడవిట్‌పై ఏం సమాధానం చెబుతారన్నారు. వివేకాహత్యకేసు విచారణపై వై.ఎస్.సునీత దాఖలు చేసిన పిల్‌లోని అంశాలతో సీబీఐ ఏకీభవించడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. తన తప్పుఒప్పుకొని, టీడీపీ అధినేత చంద్రబాబుకు, ఆయన కుటుంబానికి, తెలుగు ప్రజలందరికీ బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు.

బదిలీలపై సాగదీత ఇంకెంత కాలం? ఎస్టీయూ ప్రశ్న

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉపాధ్యాయ బదిలీలపై ఆరు నెలలుగా విద్యాశాఖ అధికారులు సాగదీస్తూ, రెండు లక్షల మందిని మానసికంగా వేధిస్తూ పాఠశాల విద్యారంగంలో గందరగోళం సృష్టిస్తున్నారని రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, హెచ్.తిమ్మన్న విమర్శించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయ సంఘాలతో బదిలీలపై చర్చలు జరపకుండానే అధికారులే వారంతటవారే సర్వే నిర్వహించి కనిష్ట-గరిష్ట కాలపరిమితి (ఐదు లేదా ఎనిమిదేళ్ల)పై రోజుకో మలుపు తిప్పుతూ ఉపాధ్యాయుల్లో గందరగోళాన్ని సృష్టిస్తున్నారన్నారు. ప్రభుత్వ ఏకపక్ష నిరంకుశ వైఖరి కొనసాగితే రాబోయే రోజుల్లో పాఠశాల విద్యలో సంక్షోభం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ విద్యా సంవత్సరం మధ్యలో బదిలీలు చేపడతారా లేక వేసవి సెలవులకు వాయిదా వేస్తారా? అన్నది పభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘాలన్నీ కనిష్టం సున్నా సర్వీస్, గరిష్టం ఎనిమిదేళ్లు ఉండాలని సీఎం జగన్ దృష్టికి విద్యాశాఖ తీసుకెళ్లగా, దానికి సమ్మతించి ఎందుకు తర్జనభర్జన చేస్తూ రోజుకొక వివాదాన్ని సృష్టిస్తున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు సైతం బదిలీలపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వకుండా, చాలా మంది ఉపాధ్యాయులు న్యాయస్థానాలను ఆశ్రయించి వివాదాలకు కారణమయ్యేలా ప్రోత్సహిస్తున్నారని నేతలు విమర్శించారు.

జాతీయ స్థాయి మారథాన్‌లో ఎస్ఆర్ఎం విద్యార్థుల ప్రతిభ

రూ.2 లక్షల నగదు బహుమతి కైవసం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పూనే నగరంలో ఈ నెల 14 నుంచి మొదలైన జాతీయ స్థాయి వోయిస్ టెక్నాలజీ ఇన్నోవేషన్ మారథాన్-2022 పోటీల్లో ఆంధ్రప్రదేశ్ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ విద్యార్థులు విశాల్, అకాంక్ష పాటిల్ విశేష ప్రతిభను కనబరిచి విన్నర్స్‌గా నిలిచారు. రూ.2 లక్షల నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందుకున్నారు. ఇంజినీరింగ్ విద్యార్థుల్లో దాగి ఉన్న సాంకేతిక పరమైన సృజనాత్మకతను వెలికి తీసేందుకు వోడా ఫోన్ ఇండియా, వోయిస్ కనెక్టింగ్ డ్రీమ్స్ ఫౌండేషన్లు సంయుక్తంగా టెక్నాలజీ మారథాన్-2022 పోటీలను నిర్వహించాయి. దేశం నలుమూలల నుంచి 560 టీములు పాల్గొన్నాయి. ఏపీ ఎస్ఆర్ఎం వర్సిటీ తరఫున కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ మూడో సంవత్సరం విద్యార్థులు విశాల్ కుమార్ సింగ్, అకాంక్ష పాటిల్ పోటీలకు హాజరయ్యారు. మూడు దశల్లో జరిగిన ప్రాజెక్ట్ ప్రెజెంటేషన్, క్వశ్చన్స్ అండ్ ఆన్సర్స్, రివ్యూస్ పోటీల్లో వీరిద్దరూ అద్భుతమైన ప్రతిభను కనబరిచి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. నిర్వాహకులు వీరికి రూ.2 లక్షల నగదు, జ్ఞాపికలను అందజేశారు. విజేతలైన ఆ విద్యార్థులను మంగళవారం యూనివర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ పీ సత్యనారాయణన్, వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్ కే అరోరా, రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్ కుమార్ అభినందించారు.

భారత విశ్వవిద్యాలయాలపై ఇండోనేషియా ఆసక్తి

విశాలాంధ్ర-విశాఖసిటీ: భారతదేశంలో ప్రముఖ విశ్వవిద్యాలయాలతో కలసి పనిచేసే దిశగా ఇండోనేషియా విశ్వవిద్యాలయాలు ఆసక్తి వ్యక్తం చేస్తున్నాయని ఆ దేశ విద్యా రంగానికి చెందిన అధికారి వ్యాఖ్యానించారు. దీనిలో భాగంగా ఆంధ్ర విశ్వవిద్యాలయంతో అవగాహన ఒప్పందం చేసుకునే దిశగా చర్చలు జరిపారు. భారత్‌లోని ఇండోనేషియా దౌత్య కార్యాలయ విద్య, సాంస్కృతిక శాఖ అధికారి ఆల్బిన్ హిర్వానే మంగళవారం ఏయూ అధికారులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. కల్చరల్ ఎక్స్ఛేంజ్‌లో భాగంగా స్టూడెంట్ ఎక్స్ఛేంజ్, ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజ్, సంయుక్త పరిశోధనలు జరిపే దిశగా అవగాహన ఒప్పందం చేసుకోవాలని ప్రాథమికంగా నిర్ణయించారు. భారత్-ఇండోనేషియాల సంస్కృతుల మధ్య సారూప్యత అధికంగా ఉంటుందని అన్నారు. ఏయూలో ఎంఏ, సంగీతం, నృత్యం, బీఎఫ్ఏ, ఎంఎఫ్ఏ, ఎంఏ హిస్టరీ, ఆర్కియాలజీ కోర్సులను అభ్యసించే విధంగా ఇండోనేషియా విద్యార్థులను పంపాలని నిర్ణయించారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రత్యేకతలు, కళలు, చరిత్ర, సాంస్కృతిక రంగాలలో సాధిస్తున్న ప్రగతిని రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ వివరించారు. అనంతరం ఇండోనేషియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు. రెక్టార్ ఆచార్య కె.సమత పాల్గొన్నారు.

అమాయకులను హింసించడమే చట్టబద్ధమా?

- పాలకుల ఆనందం కోసమే సీఐడీ వేధింపులు
- మాజీ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ ధ్వజం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీఐడీ చీఫ్ దృష్టిలో చట్టబద్ధంగా పనిచేయడమంటే, అధికారంలో ఉన్నవారి ఆనందంకోసం అమాయకుల్ని హింసించడమా? అని టీడీపీ గుంటూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ ప్రశ్నించారు. మంగళగిరిలోని పార్టీ జాతీయ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అధికారంలో ఉన్నవారి ఆనందంకోసం సీఐడీ విభాగం... అమాయకుల్ని, ప్రతిపక్షనేతల్ని, ప్రభుత్వ పనితీరును ఎత్తిచూపుతూ సామాజిక మాధ్యమంలో ఉత్సాహంగా ఉండేవారిని లక్ష్యంగా చేసుకుని వేధిస్తోందన్నారు. కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ, పనిగట్టుకొనిమరీ పగసాధిస్తోందని తప్పుపట్టారు. తప్పు (నేరం) లేకపోయినా విచారణ పేరుతో సీఎం జగన్, సజ్జల చెప్పినవారినే సీఐడీ వేధిస్తోందని అన్నారు. సీఐడీ విభాగాధిపతి రాజకీయాల్లోకి రావాలనుకుంటే, ఉద్యోగానికి రాజీనామాచేసి, నేరుగా రావచ్చు అని, చట్టబద్ధమైన పదవిలో ఉండి అమాయకుల్ని వేధించడం ఏమిటి? అని ప్రశ్నించారు. తప్పుల నుంచి ఎప్పటికీ తప్పించుకోలేరని స్పష్టం చేశారు. నలంద కిశోర్ మొదలు దారపనేని నరేంద్ర వరకు సీఐడీ వ్యవహరించిన తీరు చట్టబద్ధమా అంటూ శ్రావణ్‌కుమార్ నిలదీశారు. కరోనా సమయంలో నలందకిశోర్‌ను విచారించిన తీరు సీఐడీ విభాగానికి మాయని మచ్చకాదా?, వైసీపీ ఎంపీ రఘురామకృష్ణంరాజు, టీవీ5 ఛానెల్ యజమాని బీ.ఆర్.నాయుడు, సీనియర్ జర్నలిస్ట్ కొల్లు అంకబాబు విషయంలో సీఐడీ మితిమీరి వ్యవహరించలేదా? అని ప్రశ్నించారు. అదే అంశంపై అంకబాబును విచారించిన వారు, మళ్లీ టీడీపీ మీడియా సమన్వయకర్త దారపనేని నరేంద్రను ఎందుకు అరెస్ట్ చేశారనీ, అతడిని వేధించి, చిత్రహింసలకు గురిచేసి, ఎవరి పేరు చెప్పించాలని ప్రయత్నించారని నిలదీశారు. ఐపీసీ సెక్షన్ 153(ఏ), 505(2) కిందనే ఎందుకు కేసులు పెడుతున్నారనీ, భావప్రకటనా స్వేచ్ఛలో భాగంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడితే, కులాలు, మతాలు, వర్గాల మధ్య చిచ్చుపెట్టడం ఎలా అవుతుందంటూ సీఐడీ అధిపతిని ఆయన ప్రశ్నించారు. ఏ నిబంధనల ప్రకారం మాజీ ఐఏఎస్ అధికారిని, సీఐడీ విభాగాధిపతి విచారించారు?, అరెస్ట్ చేయడానికి వెళ్లేటప్పుడు సీఐడీ అధికారులు యూనిఫాం, నేమ్ బ్యాడ్జ్ లేకుండా ఎందుకు వెళుతున్నారు?, అలా వెళ్లడం నిబంధనలు పాటించడమా? అని పేర్కొన్నారు. ముద్దాయికి, నేరస్తుడికీ తేడా తెలియకుండా సీఐడీ వ్యవహరిస్తోందన్నారు.

సంపాదకీయం

కేరళ గవర్నర్ వింత పోకడ

కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ ఇస్లామిక్ పండితుడు. ఇస్లాం మతంలో సంస్కరణలకోసం పాటుపడ్డ వారు. కేంద్ర మంత్రివర్గంలో ఇంధన శాఖ, పౌర విమానయాన శాఖలను నిర్వహించారు. విద్యార్థి సంఘ నాయకుడిగా రాజకీయ యాత్ర ప్రారంభించిన ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ భారతీయ క్రాంతి దళ్, కాంగ్రెస్, జనతా దళ్, బహుజన సమాజ్ పార్టీలను చుట్టబెట్టి చివరకు 2004లో బీజేపీలో చేరి పుణ్యస్నానం ఆచరించారు. 2019 సెప్టెంబర్ ఒకటిన కేరళ గవర్నరుగా బీజేపీ ప్రభుత్వం ఆయనను నియమించింది. కేరళలో వామపక్ష ప్రభుత్వం అధికారంలో ఉండడం, తనను నియమించింది బీజేపీ ప్రభుత్వం కనక ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ మొదటి నుంచీ రాజును మించిన రాజభక్తి ప్రదర్శిస్తూనే ఉన్నారు. వామపక్ష ప్రభుత్వ నిర్ణయాలకు అడ్డు చెప్పడమే ఆయన ప్రధాన వ్యాపకం అయిపోయింది. ఏదో ఒక వివాదం రేపకుండా ఆయనకు రోజే గడవడం లేదు. తాజాగా కేరళలోని తొమ్మిది విశ్వవిద్యాలయాల వైస్ చాన్సలర్లను రాజీనామా చేయాలని ఆదివారం హుకుం జారీ చేశారు. సోమవారం ఉదయం పదకొండున్నరకల్లా వైస్ చాన్సలర్లందరూ రాజీనామా చేయాల్సిందేనన్నారు. ఇంతకీ ఆ వైస్ చాన్సలర్లను నియమించింది ఆయనే అన్న వాస్తవాన్ని వాటంగా మరిచిపోయినట్టున్నారు. ఆ నియామకాలు సక్రమంగా జరగలేదని ఆయన ప్రస్తుత వాదన. ఒక వేళ ఆ నియామకాలు సక్రమంగా జరగకపోతే బాధ్యత తనదేనని ఆయన ఎందుకు గుర్తించడం లేదో! వైస్ చాన్సలర్లు రాజీనామా చేయాలని ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ జారీచేసిన ఆదేశాలు సమగ్రమైన ప్రక్రియ ప్రకారం జరగలేదు కనక ఎవరూ రాజీనామా చేయనవసరం లేదని రాత్రి పొద్దుపోయిన తరవాత కేరళ హైకోర్టు న్యాయమూర్తి దేవన్ రామచంద్రన్ స్పష్టం చేశారు. దీనితో ఘనత వహించిన గవర్నర్ బిత్తర పోవలసి వచ్చింది. ఈ వైస్ చాన్సలర్లకు ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ వారిని ఎందుకు తొలగించకూడదో తెలియజేయాలని సంజాయిషీ నోటీసులు జారీ చేశారు. వారు సమాధానాలు ఇవ్వడానికి వచ్చే నవంబర్ మూడు దాకా గడువు నిర్దేశించిందీ ఆయనే. కానీ ఈ లోగానే అక్టోబర్ 24 ఉదయానికల్లా రాజీనామా చేయాలని ఆదేశించారు. 24 గంటలలోగా వైస్ చాన్సలర్లను రాజీనామా చేయాలని కోరడం బేసబబు అని హైకోర్టు తేల్చి చెప్పింది. ఇది చట్ట విరుద్ధమని కూడా స్పష్టం చేసింది. ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ ఇంత తొందరపాటు ప్రదర్శించడానికి కారణం లేకపోలేదు. ఏ.పి.జె. అబ్దుల్ కలాం విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ నియామకం విశ్వవిద్యాలయాల నిధుల సంఘం నిబంధనలకు విరుద్ధం కనక ఆ నియామకం చెల్లదని సుప్రీంకోర్టు ఇటీవల తీర్పు చెప్పింది. ఈ తీర్పు నేపథ్యంలో గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ అత్యుత్సాహం ప్రదర్శించి అందరు వైస్ చాన్సలర్లను తొలగించాలనుకున్నారు. అన్ని రాష్ట్రాలలో అక్కడి విశ్వవిద్యాలయాల చాన్సలర్‌గా గవర్నరే వ్యవహరిస్తారు. అంత మాత్రం చేత ఇష్టారాజ్యంగా చెలాయించడానికి అవకాశంఉండదు. వైస్ చాన్సలర్ల నియామకానికి నిర్దిష్ట ప్రక్రియ ఉంటుంది. మొదట వైస్ చాన్సలర్ల ఎంపిక కోసం ఒక కమిటీని ఏర్పాటు చేస్తారు. ఆ కమిటీ కనీసం ముగ్గురి పేర్లను సూచించాలి. వీటి లోంచి ప్రభుత్వం ఒకరిని ఎంపికచేసి ఆ వ్యక్తిని వైస్‌చాన్సలర్‌గా నియమించాలని గవర్నర్‌కు సిఫార్సు చేస్తుంది. అంటే ఈ నియామకాలకు సిఫార్సు చేయవలసింది రాష్ట్ర ప్రభుత్వం. రాష్ట్ర ప్రభుత్వ సిఫార్సులపై గవర్నర్‌కు అభ్యంతరాలు ఉంటే ప్రభుత్వాన్ని మరోసారి పరిశీలించమని కోరవచ్చు. అవసరం అనుకుంటే ప్రభుత్వం మార్పులు చేయవచ్చు. లేదా చేయకనూ పోవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం కనక ముందుచేసిన సిఫార్సులనే రెండోసారి కూడా పంపితే గవర్నర్ ఆమోదించి తీరవలసిందే. మరో మార్గం లేదు.

వైస్ చాన్సలర్లను ఎంపిక చేయడానికి ఏర్పాటు చేసిన కమిటీలు కొన్ని సందర్భాలలో ఒక్క పేరే సూచించాయన్నది ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ ఫిర్యాదు. అలాంటప్పుడు నియామకం జరిగిపోయిన తరవాత, ఆ నియామక పత్రాలపై తానే సంతకం చేసిన తరవాత ఇప్పుడు రాజీనామా చేయాలని కోరడంలో ఆంతర్యం ఏమిటో అంతుపట్టదు. విశ్వవిద్యాలయాల వైస్ చాన్సలర్లందరినీ గంపగుత్తగా రాజీనామా చేయమని ఆదేశిస్తే విశ్వవిద్యాలయాల నిర్వహణ అస్తవ్యస్తం అవుతుందని ఆరిఫ్ మహమ్మద్ ఖాన్‌కు తెలియదనుకోలేం. వైస్ చాన్సలర్లను ఉన్న ఫళాన రాజీనామా చేయమని ఆదేశించే అధికారం గవర్నరుకు లేదు. లేని అధికారాన్ని ఆయన చెలాయించాలనుకుంటున్నారు. పైగా వైస్ చాన్సలర్లు హైకోర్టుకు వెళ్లారు. ఆ వ్యవహారం హైకోర్టు పరిశీలనలో ఉన్న సమయంలో ఆయన ఎందుకు తొందరపడ్తున్నారో అర్థం కాదు. పోనీ అబ్దుల్ కలాం విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ నియామకం చెల్లదని సుప్రీంకోర్టు తేల్చింది కనక ఆ ఆధారంతో మిగతా వారినీ రాజీనామా చేయమని కోరుతున్నారని సరిపెట్టుకుందామనుకున్నా దానికీ అవకాశం లేదు. సుప్రీంకోర్టు తీర్పును పున: పరిశీలించాలని కోరే అవకాశం ఎప్పుడూ ఉంటుందన్న ధ్యాస ఆరిఫ్ మహమ్మ ఖాన్‌కు లేకపోవడం ఆశ్చర్యకరమే. విశ్వ విద్యాలయాల చట్టం ప్రకారం వైస్ చాన్సలర్లను తొలగించే అధికారం చాన్సలర్‌గా వ్యవహరించే గవర్నరుకు ఉండదు. ఒక వేళ ఏ కారణం చేతనైనా ఏ వైస్ చాన్సలర్నైనా తొలగించాలనుకుంటే దానికి నిర్దిష్ట విధి విధానం ఉంది. వైస్ చాన్సలర్ కనక విశ్వవిద్యాలయ నిధులను దుర్వినియోగం చేసినప్పుడో, లేదా అనైతికంగా ప్రవర్తిస్తేనో తొలగించవచ్చు. అప్పుడూ ఏకపక్షంగా తొలగించే వీలు లేదు. ఆ ఆరోపణలపై హైకోర్టు లేదా సుప్రీంకోర్టు దర్యాప్తు చేయాలి. ఆరోపణలు నిజమని రుజువైతే తప్ప తొలగించడం కుదరదు. విద్యారంగాన్ని కాషాయీకరించాలని మోదీ సర్కారు కుట్ర పన్నుతోంది కనక ఆ కుట్రకు తోడ్పడాలని అనుకోక పోతే ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ స్థాయి వ్యక్తి ఇలా వ్యవహరించడానికి వీలే లేదు.

కేరళ అభివృద్ధి పథంలో ముందంజలో ఉన్నందుకే బీజేపీకి ఇప్పటికే కంటగింపుగా ఉంది. కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రభుత్వానికి సంధాన కర్తగా వ్యవహరించవలసిన బాధ్యతను విస్మరించి ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ పక్షపాత దృష్టితో ఇలా వ్యవహరిస్తున్నారనుకోవాలి. పనిలో పనిగా గవర్నర్ పత్రికా రచయితలు, టీవీ చానళ్ల మీద కూడా విరుచుకు పడ్తున్నారు. ఆయా పార్టీల కార్యకర్తలు పత్రికా రచయితలుగా చెలామణి అవుతున్నారని ఆయన నిరాధార ఆరోపణలకు దిగారు. పత్రికా రచయితల అర్హతలను తానే నిర్ణయించాలనుకుంటున్నట్టుంది. మీడియా వారు ఆయనను కలుసుకోవడానికి రాజ్ భవన్ వెళ్లినప్పుడు వారిని రానివ్వక పోవడమే కాక నిరాధార ఆరోపణలకు దిగారు. తనను కలుసుకోవాలనుకునే మీడియా వారు అభ్యర్థన పంపితే దాన్ని పరిశీలించి అసలైన మీడియా వారెవరు, మీడియా ముసుగులో ఉన్న పార్టీల కార్యకర్తలు ఎవరు అని నిర్ధారించిన తరవాతే అనుమతిస్తానంటున్నారు. అంటే వివిధ మీడియా సంస్థలు గవర్నర్ ఆమోదం పొందిన తరవాతే తమ సిబ్బందిని నియమించుకోవాలేమో. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని బేఖాతరు చేసేలా మాత్రమే కాకుండా ప్రభుత్వ అధికారాలను కాదనేలా గవర్నర్ వ్యవహార సరళి ఉంది. విశ్వ విద్యాలయాలు స్వతంత్ర వ్యవస్థలుగా పనిచేయాలన్న మౌలిక సూత్రాన్ని గవర్నర్ విస్మరించడం ఆందోళనకరమైందే.

నాగపూర్‌లో బీజేపీకి షాకిచ్చిన కాంగ్రెస్

మహారాష్ట్రలో నాగపూర్ పంచాయితీ ఎన్నికల్లో బీజేపీ చీలిపోయిన శివసేన కూటమి అవమానకరమైన ఓటమిని చవి చూసింది. మరోవైపు గుజరాత్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి బీజేపీ గట్టిపోటీని ఎదుర్కొంటోంది. ఈ సంవత్సరాంతంలో గుజరాత్‌లో జరుగనున్నఎన్నికలకు ఇది పెద్ద ప్రశ్నార్థకంగామారింది. ఆప్‌ను గురించే కాదు. మహారాష్ట్రలో కాంగ్రెస్ విజయంపై బీజేపీ ఆందోళన చెందుతోంది. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో బీజేపీశ్రేణుల్లో తీవ్ర గందరగోళం కనిపిస్తోంది. కాంగ్రెస్ పాత్రపై ఆందోళనచెందుతోంది. గుజరాత్‌లో 27 సంవత్సరాల బీజేపీ పాలనలో ఏనాడు ప్రజల్లో ఇంతగా ప్రభుత్వ వ్యతిరేకత కనిపంచలేదు. దీని ప్రభావం మోదీ–షాలపై ఎక్కువగా ఉంటుంది. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర ప్రభావం సుదూర ప్రాంతాల్లో సైతం వ్యక్తమవుతున్నది. నాగపూర్ పరిణామాలు ఇందుకు తాజా ఉదాహరణ. నాగపూర్‌లో వీధులకు ఇరువైపులా కాంగ్రెస్ కార్యకర్తలు నిలబడి భారత్‌జోడో యాత్రకు ఘన స్వాగతం పలకనున్నారు. ఈ పరిణామాలకు రాహుల్ గాంధీని పప్పుగా అభివర్ణించిన బీజేపీ ఖంగుతిన్నది. వేనాడ్ కాంగ్రెస్ ఎంపీ భారత్ జోడో యాత్రకు స్వాగతం పలకనున్నారు.

బీజేపీకి ప్రత్యామ్నాయంగా ఓటర్లలో తీవ్ర అంతర్మథనం కలిపిస్తున్నది. నాగపూర్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం ఒక శుభపరిణామంగా అందరూ భావిస్తున్నారు. రానున్న పరిణామాలకు ఇది ఒక సంకేతంగా భావిస్తున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడిగా రాహుల్‌గాంధీ యేతర వ్యక్తి అధ్యక్షుడిగా ఎన్నికకావడం మరో ముఖ్య పరిణామం. 137 సంవత్సరాల చరిత్ర కలిగిన కాంగ్రెస్ నిస్తేజం నుండి బైట పడుతున్నది. రాహుల్ గాంధీ యాత్ర ఆశించిన ప్రయోజనాలు పొందుతుందా అనేది ప్రశ్న. కొంతవరకు సానుకూల ప్రభావం కనిపిస్తోంది. ప్రస్తుతం భారత్ జోడోయాత్ర ప్రభావం బీజేపీని కలవరపరుస్తున్న అంశంగా ఉంది. నాగపూర్ పరిణామం చిన్న విషయం కాదు. అది ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయం. పైగా కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంది. అటువంటి రాష్ట్రంలో ఈ నూతన పరిణామం బీజేపీని అంతర్మథనానికి లోను చేస్తోంది. మహారాష్ట్రలో పాదయాత్రకు లభించే ఆదరణ ఎలా ఉంటుందోనని సంస్థ కార్యకర్తలు, కాంగ్రెస్ మద్దతుదారులతో కలిసిపోయి ఆర్ఎస్ఎస్ అంచనా వేయనుంది. నాగపూర్ ఎన్నికల్లో ఒక్క అధ్యక్ష పదవిని కూడా పొందలేకపోయింది. ఉపాధ్యక్ష స్థానాల్ని మూడు పొందింది. మహారాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు చంద్ర శేఖర్ బవంకులే రాష్ట్ర ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌లు నాగపూర్ జిల్లాకు చెందినవారైనప్పటికీ ఓటమిపాలుకావడం వారికి తీవ్ర కలవం కలిగిస్తోంది. ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ నాగపూర్‌కు చెందినవాడు. వారెవ్వరూ కూడా ఓటర్ల మనోభావాలను గ్రహించలేకపోయారు. ఎన్నికల ఫలితాలు బీజేపీ కార్యకర్తల్లో నిరాశాభావాన్ని కలిగించాయి. నిరాశ, నిస్పృహలకు లోనయ్యారు. మహారాష్ట్రలో బీజేపీ నాయకత్వంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి ఘోర ఓటమిని వారు జీర్ణించు కోలేపోతున్నారు. రాజకీయాలు కేవలం భావోద్రేకాలమీద పోరాటం జరగదు. బీజేపీ పోరాడేశక్తిని గెలిచేశక్తిని కోల్పోయింది.

ఆకలి సూచికలపై కాషాయదళాల కస్సుబుస్సు

ఎం కోటేశ్వరరావు

తాజాగా ప్రకటించిన 2022 ప్రపంచ ఆకలి సూచీలో భారతదేశ దేశ స్థానం మరింత దిగజారింది. గతేడాది 116 దేశాలకు గాను 101వదిగా ఉంటే ఇప్పుడు 121లో 107వ స్థానంగా ఉంది. 2020 ఏప్రిల్‌లో తొలి కరోనా లాక్‌డౌన్ నాటి నుంచి 2022 సెప్టెంబరు వరకు ప్రతి నెలా ప్రతి ఒక్కరికి ఐదు కిలోల బియ్యం ఉచితంగా 80కోట్ల మందికి కేంద్ర ప్రభుత్వం అందిస్తే ఇంకా ఆకలి ఏమిటి అని ప్రశ్నిస్తున్నారు. ఆకలి సూచిక రూపొందించేందుకు తీసుకున్న అంశాలను, వాటిలో ఒకదాని గురించి ప్రధాన మోదీ ఆగస్టు నెల మన్‌కీ బాత్‌లో పోషకాహార లేమి మీద ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఇన్ని నెలలుగా బియ్యం,గోధుమలు, పప్పులు ఇస్తే ఇంకా పోషకాహారం లేదంటారేంటి అని ప్రశ్నించినట్లయింది. మీరు చెబుతున్నదే సరైనదనుకుంటే ప్రజా ఉద్యమం జరపాలని ఎందుకు పిలుపునిచ్చారు? బియ్యం ఇస్తే సరిపోతున్నపుడు పోషణ్, ఐసిడిఎస్ పథకాలు వాటి కింద అంగన్‌వాడీలు ఎందుకు నిర్వహిస్తున్నట్లు ?

ఎనిమిది సంవత్సరాలుగా ఆకలి సూచికలో మనకు దక్కుతున్న స్థానం గురించి ప్రతి ఏటా కాషాయ దళాలు తప్పుపడుతున్నారు. ఐరాసలో 193 దేశాలకు సభ్యత్వం ఉంది, మరో రెండు పరిశీలక దేశాలు, అసలు చేరని దేశాలూ ఉన్నాయి. ఇప్పుడు నివేదిక రూపొందించిన సంస్థలకు సమగ్రంగా తమ సమాచారం ఇచ్చిన దేశాలు 121మాత్రమే. అమెరికా, ఐరోపా దేశాల్లో సమాచారం ఇవ్వకపోతే మీడియాలో విమర్శించే స్వేచ్ఛను అక్కడి జర్నలిస్టులు వినియోగించుకుంటున్నారు. అమెరికా వంటి దేశాలు మనం సమాచారం ఇస్తున్నా అక్కడ కేసులు పెడుతున్నాయి. మన దేశంలో ఆకలి సంబంధిత అంశాల గురించి స్వచ్ఛంద సంస్థలు ఏమి చెబుతున్నాయో, మన ప్రభుత్వ సంస్థలు ఎలాంటి నివేదికలిస్తున్నాయో ఆకలి సూచికలను తప్పుపడుతున్నవారు జనానికి చెబుతున్నారా? మన దేశం తప్ప ఈ నివేదికను ఎవరూ ఆమోదించటం లేదని గానీ, తప్పుడు పద్దతుల్లో రూపొందించారని గానీ ఎన్నిదేశాలు స్పందించిందీ సమాచారం లేదు. ఒక్క ఆకలి సూచికనే కాదు, అనేక సూచికలను ఎప్పుడైనా మోదీ సర్కార్ అంగీకరించిందా ? లేదు, ఎందుకంటే అన్నింటా అధమస్థానాలే.

మోదీ ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రచారం చేసుకున్న సులభతర వాణిజ్య సూచిక గురించి పరిశీలిద్దాం. 2014లో 142లో ఉన్న స్థానాన్ని 2020 నాటికి 63కు తీసుకువచ్చామని, 79 స్థానాలు ఎగబాకిందని చెప్పారు. చివరికి ఈ సూచికలు రూపొందించిన తీరు పెద్ద కుంభకోణమని, సమాచారాన్ని తారుమారు చేశారని, ప్రపంచ బాంకు, సిబ్బంది అక్రమాలకు పాల్పడ్డారని చెబుతూ మరుసటి ఏడాది నుంచి ఏకంగా సూచికల రూపకల్పనకే స్వస్థి పలికారు. ఆ మేరకు మన దేశానికి ఆ స్థాయిలో ఎందుకు పెట్టుబడులు రాలేదు, మేకిన్, మేడిన్ ఇండియా ఎందుకు విఫలమైనట్లు ? ఆకలి సూచికలను రూపొందించేందుకు ప్రాతిపదికగా తీసుకున్న నాలిగింటిలో మూడు పిల్లల ఆరోగ్యానికి సంబంధించినవి, వాటిని మొత్తం జనాభాకు ఎలా వర్తింప చేస్తారు అన్నది కేంద్రప్రభుత్వ అభ్యంతరాల్లో ఒకటి. ఆ ప్రాతిపదికను మన దేశానికి మాత్రమే వర్తింప చేయడం తప్పే. అన్ని దేశాలకూ ఒకటే

పద్ధతిని అనుసరించారు కదా ! పోషకాహార లేమికి గాను కేవలం మూడువేల మందితో జరిపిన సర్వేను ఎలా ప్రాతిపదికగా తీసుకుంటారు అన్నది మరో అభ్యంతరం. ఇది కూడా అన్ని దేశాలకూ ఒకటే పద్ధతి. ఏ సర్వేకైనా జనాభాలో ఎంత మందిని తీసుకుంటే సరైన వాస్తవాలు వెల్లడవుతాయో ఎవరైనా చెప్పగలరా? మన ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వేలు ఎంతమంది మీద జరుపుతున్నారో చెప్పి ప్రభుత్వం ఒప్పించగలదా ? ఒక పద్ధతి ప్రకారం మన దేశం గురించి తప్పుగా చూపేందుకు ప్రతి ఏటా తప్పుడు సమాచారమిస్తున్నారని ప్రభుత్వం ఆరోపిస్తోంది. ప్రభుత్వం చెబుతున్న మూడువేల మందిని సర్వే చేసింది ఐరాస సంస్థలలో ఒకటైన ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ). అది కూడా వేరే సంస్థ ద్వారా చేయించింది.

స్వదేశీ జాగరణ మంచ్ సహ కన్వీనర్ ఆర్ఎస్ఎస్ నేత అశ్వనీ మహాజన్ 2021 ఆకలి సూచిక నివేదిక తప్పుల తడక అంటూ 2021 నవంబరు పదవ తేదీన పయనీర్ ఆంగ్ల పత్రికలో పెద్ద వ్యాసం రాశారు. దానిలో దేశంలో కూరగాయలు, గుడ్లు, పండ్లు, పాలు ఇతర ఆహారఉత్పత్తులు ఎలా పెరిగాయో పేర్కొంటూ ఇవన్నీ ఉన్నపుడు పోషకాహారలోపం ఎలా ఉంటుందని ప్రశ్నించారు. ఆకలి సూచికల రూపకల్పనకు నేషనల్ శాంపుల్‌సర్వే సంస్థ (ఎన్ఎస్ఎస్ఓ) నుంచి ఆహారవినియోగ సమాచారాన్ని తీసుకోవాలని చెప్పారు. 2011–12 తరువాత అసలు అలాంటి సమాచారాన్ని ప్రచురించలేదని, 2015–16 సర్వేలో తీవ్ర లోపాలు ఉన్నందున అసలు దాన్ని ప్రచురించ కుండా వెనక్కు తీసుకున్నారని, అందువలన 2021 ఆకలి సూచీని 2011–12 సమాచారంతో రూపొందించారని మహాజన్ ఆరోపించారు. 2019 ఎన్నికలకు ముందు నిరుద్యోగం నాలుగు దశాబ్దాల రికార్డులను బద్దలు కొట్టిందని ప్రభుత్వ సమాచారం వెల్లడిస్తే ఎన్నికలు ముగిసేవరకు దాన్ని వెలువడకుండా అడ్డుకున్నారు. గతంలో ఎఫ్ఏఓ మన దేశంలో ఆహార వినియోగం గురించి జాతీయ పౌష్టికాహార పర్యవేక్షణ బోర్డు (ఎన్ఎన్ఎంబి) సమాచారం మీద ఆధారపడేది. 2011 తరువాత గ్రామీణ ప్రాంతాల్లో, 2016 తరువాత పట్టణ ప్రాంతాల్లో తాము ఎలాంటి సర్వేలు జరపలేదని ఎన్ఎన్ ఎంబి చెప్పిందని కూడా మహాజన్ పేర్కొన్నారు. (ప్రభుత్వం దగ్గర సమాచారం లేనపుడు గాలప్‌పోల్ వంటి సంస్థల మీద ఆధారపడి దాన్ని విశ్లేషణకు తీసుకున్నట్లు చెప్పవచ్చు. దానికి ఎవరిది బాధ్యత ఎవరిది ?) అశ్వనీ మహాజన్ సరికొత్త అంశాన్ని ముందుకు తెచ్చారు. జాతీయ పోషకాహార సంస్థ(ఎన్ఐఎన్) 2016లో చేసిన సర్వే ప్రకారం 16 రాష్ట్రాల్లో కార్లు, ఇళ్లు ఉన్న ధనికుల పిల్లల్లో 17.6శాతం మంది గిడసబారి ఉన్నారని, 13.6 శాతం మంది బలహీనంగా ఉన్నారని పేర్కొన్నారు. అధిక బరువు, ఊబకాయం ఉన్న మహిళలకు పుట్టే పిల్లల్లో 22 శాతం మంది గిడసబారటం, 11.8 శాతం బలహీనంగా ఉంటారని చెప్పారు. ఈ వాదన ఎందుకు చేశారంటే డబ్బున్న వారు కూడా సరిగా పిల్లల్ని పెంచటం లేదు, ఆరోగ్యాన్ని పట్టించుకోవటం లేదు దీనికి ప్రభుత్వం ఏమి చేస్తుంది, నరేంద్రమోదీ ఏమి చేస్తారని వాదించటం, వాస్తవాన్ని వక్రీకరించటం, వైఫల్యాన్ని అంగీకరించకపోవటమే. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే–4ను 2014–15లో ఐదవ సర్వేను 2019–20లో నిర్వహించారు. ఈ సర్వేల మధ్య వచ్చిన మార్పు, ఆకలి సూచికల్లో 2014–2022 కాలంలో వచ్చిన మార్పులు ఏమిటి ? దిగువ పట్టికలో చూద్దాం. అంకెలను శాతాలుగా గమనించాలి. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం రక్తహీనత అంశంలో ఒక్క కేరళ తప్ప మిగతా రాష్ట్రాలన్నింటా పరిస్థితి తీవ్రంగా ఉంది.

అంశం	సర్వే4(శాతం)	సర్వే 5	2014	2022
గిడసబారినపిల్లలు	38	36	38.7	35.5
బలహీన పిల్లలు	21	19	15.1	19.3
శిశుమరణాలు	22.7	25	4.6	3.3
పోషకాహారలేమి	00	00	14.8	16.3
బరువు తక్కువ	36	32	000	000
రక్తహీన పిల్లలు	58.6	67	000	000
రక్తహీన మహిళలు	53.1	57	000	000
రక్తహీన పురుషులు	22.7	25	000	000

దశాబ్దాల పాటు ఎలాంటి సర్వేలు నిర్వహించని మన ప్రభుత్వాలు, పాలకులకు, వారి మద్దతుదార్లకు సూచికలను రూపొందించే సంస్థలను విమర్శించేందుకు ఉన్న నైతిక అర్హత ఏమిటి ? తాజా ఆకలి సూచిక విశ్లేషణకు 2017 నుంచి 2021వరకు ఉన్న ఐదేండ్ల సమాచారాన్ని విశ్లేషించారు. 2022 నివేదికలో మన దేశం సాధించిన మార్కులు 29.1 కాగా ఐదు శాతం లోపు మార్కులతో చైనా సహా 17 దేశాలు ఒకటవ స్థానంలో ఉన్నాయి. అమెరికా,బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్సు వంటి దేశాలు అసలు ఈ జాబితాలోనే లేవు. 2014లో పేర్కొన్న 76 దేశాల్లో మనది 55వ రాంకు వాస్తవం కాదనేది కొందరి వాదన. మరి ఎంత? ఆ జాబితాలో ఐదు కంటే తక్కువ మార్కులు తెచ్చుకున్న 44 దేశాలను సూచికలో చూపలేదు. వాటిని కలుపుకుంటే మొత్తం దేశాలు 122 మన రాంకు 99 అవుతుంది. తాజా రాంకుల్లో అలాంటి దేశాలన్నింటినీ కలిపితే 121లో మనది 107 పెరిగినట్లా దిగజారినట్లా ? మనం తెచ్చుకున్నమార్కులను చూస్తే 2014లో మన దేశానికి వచ్చిన మార్కులు 28.2 కాగా 2022లో 29.1 అంటే 0.9 మాత్రమే ఎనిమిది సంవత్సరాల్లో పెరిగింది. పాకిస్తాన్, బంగ్లాదేశ్ మన కంటే మెరుగ్గా ఉండటమే కాషాయ దళాల గగ్గోలుకు అసలు కారణం.

వరదల్లో పేదల బాధలు వర్ణనాతీతం

టి.వి.సుబ్బయ్య

ప్రతిఏటా దేశంలోని అత్యధిక ప్రాంతాల్లో వర్షాలు సృష్టించే వరదలకు రైతులు, రైతు కూలీలు, పేదలు పడే కష్టాలు అపరిమితం.పెద్ద నగరాలు, పట్టణాలలో పనులకోసం వెళ్లే కూలీలు, పనిపాటలు చేసుకుని నగర శివార్లలో నివశించేవారు పడేకష్టాలు అపరిమితం. ఈ సందర్భాల్లో పనులు, ఆదాయం ఉండదు. ఇక రోజు వారిగా ఉదయం కాలకృత్యాలు తీర్చుకొనేందుకు అష్టకష్టాలు పడవలసిందే. పాకలు, రేకుల షెడ్లు తీవ్ర వర్షాలకు, గాలులకు పడిపోయి నివాసానికి అవకాశం ఉండదు. లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజల బాధలు వర్ణనాతీతం. ఆంధ్రప్రదేశ్‌లోగానీ, మరో రాష్ట్రంలో నైనా ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వం వీరి సమస్యలను ప్రత్యేకంగా చర్చించి తగు ప్రణాళికలు రూపొందించి ముందుజాగ్రత్త చర్యలు అమలుచేసిన దాఖలాలు కనిపించవచ్చు. లోతట్టుప్రాంతాలు, దూరప్రాంతాల్లో పనులు చేసుకునే వారే ఎక్కువగా వరదల కష్టాలు పడే విషయం పాలకులకు తెలియదనుకోలేం. అలాగే నీటిని నిల్వచేసి, పొలాలకు, ప్రజల దాహార్తి తీర్చేందుకు, నిర్మించే ప్రాజెక్టుల కోసం, గ్రామాలను ఖాళీ చేయడంతో ప్రజలు పడే కష్టాలను సీరియస్‌గా తీసుకోవాలని, ప్రాజెక్టును నిర్మించడానికి ముందే నిర్వాసితుల సమస్యలను పరిష్కరంచాలని దశాబ్దాలుగా ప్రతిపక్షాలు, నిర్వాసితులు కోరుతున్నప్పటికీ పాలకులు సమస్యలు పట్టించుకోవడం లేదు.

ఇక రైతులు పండించిన పంటను దక్కించుకునేందుకు తీరని కష్టాలనే ఎదుర్కొంటున్నారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయడానికి ఇటు పాలకులు, అటు వ్యాపారులు ముందుకురారు. ఒక వేళ కొనగోలు చేసినా అతి తక్కువధరకు అమ్ముకొని రైతులు నష్టపోయి అప్పుల ఊబిలో చిక్కుకుంటున్నారు. ఈ అప్పుల వలనే రైతులు వేలాదిమంది ప్రతి ఏటా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ అప్పులను రద్దుచేసి మళ్లీ వ్యవసాయం సంక్షోభం నుంచి బైటపడేందుకు చేపట్టవలసిన చర్యలను కేంద్రం ముఖ్యంగా పార్లమెంటులో చర్చించిన దాఖలాలు లేవు. ఇక ఆర్ఎస్ఎస్, బీజేపీ నాయకుడు నరేంద్ర మోదీ ప్రభుత్వం కీలకమైన చట్టాలు చేయడానికి సైతం పార్లమెంటులో చర్చించడం లేదు. రైతులకు ఏడాదికి రూ.6వేలు అదీ మూడు దఫాలుగా రూ.2వేల చొప్పున ఇచ్చి సమస్యలను పరిష్కరించామని ప్రచారం చేసుకోవడం మనం చూస్తున్నాం. వ్యవసాయ రంగాన్ని మోదీ ప్రభుత్వం కుదేలు పరిచింది. ఫలితంగా మోదీ ఎనిమిదేళ్ల పాలనలో చిన్న, సన్నకారు రైతులు లక్షలాదిమంది దారిద్ర్య రేఖకు దిగువకు చేరి పేదరికం జాబితాలో చేరారు. దేశంలో అసలు పేదరికం లేదని, అంతర్జాతీయ సర్వేలను తాము నమ్మమని బీజేపీ నేతలు, మంత్రులు చెప్తుంటారు. నిజంగా పేదరికం, ఆకలి లేక గత రేండేళ్లుగా 80కోట్ల మందికి ఉచితంగా ఆహారధాన్యలు పంపిణీ చేస్తున్నామని, ఇంకా పేదరికం, ఆకలి ఎక్కడుందని బీజేపీపాలకులు ప్రచారం చేసుకుంటున్నారు. ఐదు మిలియన్‌డాలర్ల ఆర్థిక వ్యవస్థ అవతరించ నున్నదని డప్పాలు కొట్టుకోవడం ద్వారా అంతర్జాతీయంగా, దేశంలో ప్రజలను నమ్మించేందుకు ప్రాధాన్యతనిస్తున్న బీజేపీ పాలకులు అబద్దాలు చెప్పదానికి బాగా అలవాటు పడ్డారు.అంతర్జాతీయ సర్వేలు వెల్లడించే ఆకలి సూచీలను తిరస్కరించడం లోనూ మనవాళ్లు ఆరితేరారు. 2020లో ఆకలి సూచీలో మనం 94వ స్థానంలో ఉండగా 2021లో 101 స్థానంలోనూ, 2022లో 107వ స్థానానికి దిగజారిన విషయాన్ని అంగీకరించరు. ఇక కరోనా కాలంలో కొత్తగా 5.6కోట్ల మంది పేదరికం జాబితాలోకి జారుకున్నారని ప్రపంచ బ్యాంకు నివేదిక వెల్లడించింది. ఇక తప్పుడు సర్వేలు నిర్వహించే సంస్థలు బీజేపీ ప్రభుత్వ హయాంలో ఏర్పడ్డాయన్నది వాస్తవమేనని చెప్పడానికి 'మార్నింగ్ కన్సల్ట్' మంచి ఉదాహరణ. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉత్తర అమెరికా నుంచి పనిచేస్తున్న ఈ సంస్థ అంతర్జాతీయ స్థాయిలో 'మోదీ ప్రతిష్ట' పెంచడంతో తల మునకలై ఉంటోందని విశ్లేషకులు చెపుతున్నారు. అనుకూలంగా ఉండే సర్వేలను సంఘపరివార్, బీజేపీ ఏర్పాటు చేసుకున్న సొంత ప్రచారయంత్రంగా నిత్యం జనాన్ని తప్పుదారి పట్టించే ప్రచారంలో తల మునకలై ఉంటుంది.

హిందీ రుద్దడం మానుకోవాలి

హిందీ భాషపై మళ్లీ దుమారం చెలరేగింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన అధికార భాషలపై గత నెలలో జరిగిన పార్లమెంట్ కమిటీ సమావేశం మొత్తం112 సిఫార్సులతో కూడిన ప్రతిపాదనలను రాష్ట్రపతి కార్యాలయానికి పంపింది. 1963 అధికార భాషల చట్టం ప్రకారం 1976లో ఏర్పడిన ఈ కమిటీలో 20 మంది లోక్‌సభ సభ్యులు, పది మంది రాజ్యసభ సభ్యులు మొత్తం 30 మంది ఎంపీలు ఉన్నారు. సెంట్రల్ యూనివర్సిటీలతోపాటు ఐఐటీ, ఐఐఎం,ఎయిమ్స్,టెక్నికల్, నాన్ టెక్నికల్ విద్యాసంస్థలన్నింటిలోనూ హిందీని తప్పనిసరి చేయాలని, కేంద్రీయ, నవోదయ విద్యాలయాల్లో హిందీ మీడియం మాత్రమే ఉండాలని ఈ కమిటీ సూచించింది. ఐఐటీలు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో ఇంగ్లీషు స్థానంలో హిందీని తప్పనిసరి చేయాలని కూడా సిఫారసు చేసింది. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, కోర్టు తీర్పులు..అన్నింటిలోనూ ఉత్తర ప్రత్యుత్తరాలు హిందీ భాషలోనే జరగాలని నివేదించింది. కొన్ని ప్రాంతాల్లో మాత్రమే ఇంగ్లీషును అనుమతించాలని, ఆ ప్రాంతాల్లో కూడా క్రమంగా ఇంగ్లీషు స్థానంలో హిందీని భర్తీ చేయాలని ప్రతిపాదించింది. ప్రభుత్వ ఆహ్వాన పత్రికలు, ఉపన్యాసాలు అన్నీ హిందీలోనే ఉండాలని సూచించింది. ప్రపంచ వ్యాప్తంగా హిందీ భాషకు ప్రాచుర్యం లభించినందున ఐక్యరాజ్య సమితి అధికార భాషల్లో దీనిని చేర్చాలని కమిటీ సిఫారసు చేసింది.

అన్నిటికంటే ముఖ్యంగా దేశంలో వివిధ భాషలు మాట్లాడే ప్రాంతాలను ఈ కమిటీ మూడు భాగాలుగా విభజించింది. హిందీ మాట్లాడే రాష్ట్రాలు బీహార్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, జార్ఖండ్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్, ఉత్తర్ ప్రదేశ్, ఢిల్లీ, అండమాన్ నికోబార్ దీవులను ఏ గ్రూప్‌లో చేర్చింది. గుజరాత్, మహారాష్ట్ర, పంజాబ్, చండీఘర్, దమన్ అండ్ దయూ, నాగర్ హవేలీలను బీ గ్రూప్‌లో, మిగిలిన వాటిని సీ గ్రూప్‌లో చేర్చింది. హిందీ మాట్లాడేవారిని ఏ గ్రూప్‌లో చేర్చడం వివాదానికి దారి తీసింది. మిగతా భాషలు మాట్లాడేవారిని ద్వితీయ పౌరులుగా చూస్తారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేశ విభజనకు దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

ఈ కమిటీ సిఫారసులు వివాదాస్పదమయ్యాయి. హిందీయేతర భాషలు మాట్లాడే రాష్ట్రాల వారు, ముఖ్యంగా దక్షిణాదివారు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ కమిటీ సిఫారసులను అమలు చేయడం అంటే అన్ని ప్రాంతీయ భాషలను ఒక్క వేటుతో తుదముట్టించడమేనని పేర్కొంటున్నారు. ఈ ప్రతిపాదనలు మాతృ భాషలకు ముప్పు కలిగించే విధంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కర్ణాటకలోని చిత్రదుర్గలో భారత్ జోడో యాత్ర చేస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఈ విషయమై స్పందించారు. భాష అనేది ఓ విశ్వాసం, ఓ భావన, భాషలో ఓ చరిత్ర ఉంటుందని, ప్రతి రాష్ట్రానికీ తమ ప్రాంతీయ భాషను ఉపయోగించుకునే హక్కు ఉందని తెలిపారు. విద్యార్థులు తమకు తెలిసిన భాషలో పరీక్షలు రాయడానికి అనుమతించాలని రాహుల్ చెప్పారు.

భిన్నత్వంలో ఏకత్వం అనే భావనకు ప్రతీకగా నిలిచే భారత్‌లో ఏ ఒక్క భాషనైనా ఇతర భాషల కంటే ఎక్కువ చేసినా అది దేశ సమగ్రతను దెబ్బతీస్తుందని హెచ్చరిస్తూ కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. అన్ని రాష్ట్రాల భాషలను అధికార భాషలుగానే కేంద్రం పరిగణించాలని, హిందీని తప్పనిసరి చేసే ప్రయత్నం చేయొద్దని డీఎంకే అధినేత, తమిళనాడు సీఎం స్టాలిన్ ప్రధానిని కోరారు. దేశంలో హిందీ భాషను మాట్లాడని వారే ఎక్కువమంది ఉన్నారన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. కేంద్రం తన ప్రయత్నాలను విరమించుకోవాలని, లేకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి ఉంటుందని స్టాలిన్ హెచ్చరించారు. మరోసారి హిందీ వ్యతిరేక ఉద్యమం రావాలని తాము కోరుకోవడం లేదని డీఎంకే ఎంపీ కనిమొళి స్పష్టం చేశారు. హిందీని అభివృద్ధి చెందని రాష్ట్రాల భాషగా డీఎంకేకు చెందిన మరో ఎంపీ ఇళంగోవన్ పేర్కొన్నారు. పశ్చిమబెంగాల్, గుజరాత్,మహారాష్ట్ర,తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ వంటి అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో హిందీ మాతృభాషగా లేదన్నారు.

హిందీ భాషను బలవంతంగా రుద్దితే దేశం ముక్కలవుతుందని ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో, టీఎన్‌సీసీ అధ్యక్షుడు కేఎస్ అళగిరి కేంద్రాన్ని హెచ్చరించారు. బీజేపీ పాలనలో హిందీని అధికార భాషగా రుద్దేందుకు తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయని వారు విమర్శించారు. ఇటువంటి ప్రయత్నాలను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చెప్పారు. భారత్‌కు జాతీయ భాష అంటూ ఏదీ లేదని, ఇతర అధికారిక భాషల మాదిరిగానే హిందీ కూడా ఓ అధికారిక భాష మాత్రమేనని తెలంగాణ మంత్రి కె.తారకరామారావు అన్నారు. హిందీని రాష్ట్రాలపై రుద్దడం ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని చెప్పారు. రాజకీయ పార్టీల నేతలే కాకుండా విద్యావేత్తలు కూడా ఈ ప్రతిపాదనలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. పోటీ ప్రపంచాన్ని తట్టుకొని ఉద్యోగాలు సంపాదించాలన్నా, ఉన్నత స్థాయికి ఎదగాలన్నా ఇంగ్లీష్ తప్పనిసరని నిపుణులు చెబుతున్నారు. ఇంగ్లీష్‌లో కమ్యూనికేషన్ స్కిల్స్ లేకపోతే యువత మనుగడ కష్టమని, హిందీని రుద్దడమంటే భావి పౌరుల జీవితాలతో ఆడుకోవడమేనన్న భావన వారిలో నెలకొంది. ప్రాంతీయ భాషలకు, మాతృభాషలకు ప్రాధాన్యత కలిగిన భిన్నత్వంలో ఏకత్వం గల మన దేశంలో ఇలాంటి నిర్ణయాల వల్ల విద్య, ఉపాధి పరంగా ఇబ్బందులు తలెత్తడమేకాకుండా ప్రాంతాల మధ్య విద్వేషాలు రగిలే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

– శిరందాసు నాగార్జున

హిమాచల్ పీఠంపై కాంగ్రెస్ కన్ను

- బీజేపీ ఓటమికి తీవ్ర ప్రయత్నాలు
- ప్రభుత్వ వ్యతిరేకత, వీరభద్రసింగ్ వారసత్వంపై ఆశలు
- ఐదేళ్ల సంప్రదాయం కొనసాగేనా?

న్యూఢిల్లీ: హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి పీఠం దక్కించుకునేందుకు కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. పాలక బీజేపీని గద్దెదించడంపై ప్రత్యేకదృష్టి కేంద్రీకరించింది. ఎట్టిపరిస్థితుల్లోనూ అధికారం దక్కించుకోవాలని అన్ని అస్త్రాలు సంధిస్తోంది. అధికారం కోసం తన ప్రయత్నాలు కొనసాగిస్తూనే...ప్రభుత్వ వ్యతిరేకత, ధరల పెరుగుదల, నిరుద్యోగంపై విస్తృత ప్రచారం చేస్తోంది. మాజీ ముఖ్యమంత్రి, పార్టీ సీనియర్ వీరభద్రసింగ్ వారసత్వాన్ని ఉపయోగించుకుంటుంది. అయితే, కాంగ్రెస్ పార్టీకి అంతర్గత కలహాలతో పాటు పార్టీ ఫిరాయింపులు తలనొప్పిగా మారాయి. మాజీ సీఎం వీరభద్రసింగ్ తనయుడు విక్రమాదిత్య, మాజీ మంత్రి బీడీ రఘువీర్ బాలి సహా కొంతమంది యువ నేతలను రంగంలో దించినప్పటికీ మరికొంతమందికి టికెట్లు ఇవ్వడంలో విఫలమైంది. అనేకసార్లు కాంగ్రెస్‌కు ఒంటిచేత్తో అధికారం సాధించిపెట్టిన వీరభద్రసింగ్ వంటి నాయకుడు ఈసారి కాంగ్రెస్‌కు ఎవరూ కనిపించడం లేదు. వీరభద్రసింగ్ లేకపోయినా ఆయన భార్య ప్రతిభాసింగ్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం బాధ్యతలను నెత్తికెత్తుకున్నారు. సాధారణంగా హిమాచల్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్, బీజేపీ మధ్య ముఖాముఖి పోరు ఉండేది. అయితే ఈసారి అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ రంగంలో దిగింది. ప్రభుత్వ వ్యతిరేక ఓటును ఆప్ చీలుస్తుందన్న ఆందోళన కాంగ్రెస్‌ను పట్టిపీడిస్తోంది. రాష్ట్రంలో బీజేపీ మట్టికొట్టుకుపోతుందని, కాంగ్రెస్ అధికారం చేపడుతుందని, ఆప్ ప్రతిపక్ష పాత్రకు పరిమితమవుతుందని కొంతమంది కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ఓటర్లను ఆకర్షించడానికి అనేక ప్రజాకర్షక పథకాలను కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని, 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామని, మహిళలకు నెలకు రూ.1500 చెల్లిస్తామని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా మారుస్తామని కాంగ్రెస్ హామీలు గుప్పించింది.

హిమాచల్‌ప్రదేశ్‌లో దశాబ్దాలుగా ఏ ఒక్క రాజకీయ పార్టీ వరుసగా రెండుసార్లు పదవి చేపట్టిన దాఖలాలు లేవు. ప్రతి ఐదేళ్లకు ఒకసారి కాంగ్రెస్, బీజేపీకి అధికారం బదిలీ అవుతుంటుంది. దీనిపైనా కాంగ్రెస్ ఆశలు పెట్టుకున్నది. 68 మంది సభ్యులు గల హిమాచల్ అసెంబ్లీకి 2017లో జరిగిన ఎన్నికల్లో బీజేపీకి 44, కాంగ్రెస్‌కు 21 సీట్లు లభించాయి. బీజేపీకి 48శాతం ఓట్లు రాగా కాంగ్రెస్‌కు 42 శాతం లభించాయి. 2012లో కాంగ్రెస్‌కు 36 సీట్లు రాగా బీజేపీకి 26 మాత్రమే దక్కాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రస్తుతం ఎదురుదాడి సిద్ధాంతంతో ముందుకు పోతోంది. గడచిన ఐదేళ్లలో బీజేపీ చేసిందేమీ లేదని, కేవలం ప్రధాని నరేంద్రమోదీ పేరుతోనే సీఎం జైరామ్ థాకూర్ ఓట్లు అభ్యర్థిస్తున్నారని విమర్శిస్తోంది. ముఖ్యమంత్రి నాయకత్వంలో రాష్ట్రం మాఫియా చేతుల్లోకి వెళ్లిందని, తాను చేసిన అభివృద్ధిని చెప్పి ఓట్లు అడిగే ధైర్యం ముఖ్యమంత్రికి లేదని సీఎల్‌పీ నేత ముకేశ్ అగ్నిహోత్రి ఆరోపించారు. 'ఇవి సార్వత్రిక ఎన్నికలు కాదు. రాష్ట్ర ఎన్నికలు. వాస్తవంగా రాష్ట్రానికి తానేమి చేశాడో ముఖ్యమంత్రి ప్రజలకు చెప్పుకోవాలి. ఆయన చేసిందేమీ లేదు. అందుకే అసెంబ్లీ ఎన్నికలు అయినప్పటికీ ప్రధానమంత్రిపైనే సీఎం ఆధారపడి రాజకీయం చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో సీఎంను ప్రజలు ఇంటికి పంపడం ఖాయం' అని అగ్నిహోత్రి వివరించారు. ఈ ఐదేళ్ల కాలంలో ముఖ్యమంత్రి థాకూర్ హెలికాప్టర్లలో తిరగడం, సంప్రదాయ జానపద నృత్యాలు చేయడం మినహా చేసిందేమి లేదని అన్నారు. థాకూర్‌ను పనిచేయని ముఖ్యమంత్రిగా అభివర్ణించారు. ఐదేళ్లుగా అసెంబ్లీ లోపలా, వెలుపలా బీజేపీ దుష్టపాలనను ఎండగడుతున్నామని, ప్రజాసామస్యలపై పోరాటం చేశామని కాంగ్రెస్ చెప్పుకుంటోంది.

వడోదరలో మతఘర్షణ: 19 మంది అరెస్టు

వడోదర: గుజరాత్‌లోని వడోదర పట్టణంలో దీపావళి సందర్భంగా మతచిచ్చు రగిలింది. రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకోగా 19 మందిని అరెస్టు చేసినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. పరిస్థితి అదుపులోనే ఉన్నదని, ఆ ప్రాంతంలో భద్రతా సిబ్బందిని మోహరించినట్లు వడోదర డీఎస్పీ యశ్పాల్ జగనియా తెలిపారు. సోమవారం అర్ధరాత్రి 12.45 గంటలప్పుడు పనిగేట్ పరిసరాల్లో మతఘర్షణ జరిగిందని, ఆ సమయంలో ఓ ఇంటి మూడో అంతస్తుపై నుంచి పోలీసుపైకి పెట్రో బాంబు విసరగా ఆ వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. ఒకరికి గాయాలయ్యాయని తెలిపారు. దీపావళి రాకెట్ కారణంగా పార్కింగ్‌లో ఉన్న బైకు తగలబడినట్లు వెల్లడించారు. టపాసులు, రాకెట్ బాంబులను దీపావళి సందర్భంగా కాల్చడం రెండు వర్గాల మధ్య గొడవకు దారితీసిందని, రాళ్ల దాడి జరిగిందని పోలీసు అధికారి తెలిపారు.

ఢిల్లీలో పెరుగుతున్న డెంగీ కేసులు

న్యూఢిల్లీ: అక్టోబర్‌లో దేశ రాజధాని ఢిల్లీలో 900 పైగా డెంగీ కేసులు నమోదయ్యాయి. దీంతో ఈ ఏడాది ఇప్పటివరకు మొత్తం కేసుల సంఖ్య 1,876కి చేరుకుంది. నగరంలో ఈ ఏడాది 194 మలేరియా కేసులు, 38 చికున్‌గున్యా కేసులు నమోదయ్యాయి. అక్టోబరు 12 వరకు డెంగీ సోకిన వారి సంఖ్య 1,572కి చేరింది. మునిసిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ (ఎంసీడీ) విడుదల చేసిన నివేదిక ప్రకారం... తరువాతి వారంలో 300 కొత్త కేసులు నమోదయ్యాయి. ఈ సంవత్సరం ఢిల్లీలో అక్టోబర్ 19 వరకు మొత్తం డెంగీ కేసుల సంఖ్య 1,876కి చేరుకుంది. ఒక్క సెప్టెంబర్‌లో 693 కేసులు నమోదయ్యాయి. 2017 నుంచి జనవరి 1-అక్టోబర్ 19 మధ్య కాలంలో అత్యధిక సంఖ్యలో డెంగీ కేసులు నమోదైనట్లు నివేదిక వెల్లడించింది. కాగా ఈ ఏడాది డెంగీ కారణంగా ఇప్పటివరకు ఎలాంటి మరణాలు నమోదు కాలేదని, 2021లో 23 మంది ప్రాణాలు కోల్పోయారని నివేదిక వివరించింది.

రిషి సునాక్ అర్ధాంగికి రూ.126 కోట్ల వార్షిక డివిడెండ్

న్యూఢిల్లీ: బ్రిటన్ కొత్త ప్రధాని రిషి సునాక్ సతీమణి అక్షత మూర్తి ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి కుమార్తె అన్న సంగతి తెలిసిందే. అక్షత మూర్తికి ఇన్ఫోసిస్ లో భారీగా షేర్లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో, 2022 సంవత్సరానికి గాను అక్షత మూర్తి ఆ వాటాలపై భారీ డివిడెండ్ పొందారు. ఆమెకు తన వాటాలపై రూ.126.61 కోట్ల ఆదాయం లభించింది. అక్షత మూర్తికి ఇన్ఫోసిస్ లో 0.93 శాతం వాటా ఉంది. ఆమె పేరిట 3.89 కోట్ల షేర్లు ఉండగా, వాటి విలువ రూ.5,956 కోట్లు. సెన్సెక్స్‌లో మంగళవారం ఇన్ఫోసిస్ షేరు రూ.1,527.40 వద్ద ట్రేడవుతోంది. ఈ ఏడాది మే 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి ఇన్ఫోసిస్ ఒక్కో షేరుపై రూ.16 చొప్పున డివిడెండ్ చెల్లించింది. మే నుంచి అక్టోబరు వరకు రూ.16.5 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. ఒక్కో షేరుపై మొత్తం డివిడెండ్ రూ.32.5 కాగా, అక్షత మూర్తికి తన వాటాలపై భారీ మొత్తంలో డివిడెండ్ దక్కింది.

కోయంబత్తూరులో పారిశుధ్య కార్మికుల నిరవధిక సమ్మె

కోయంబత్తూర్: కార్పొరేషన్‌లో కాంట్రాక్టుపై పనిచేస్తున్న 5 వేల మంది పారిశుధ్య కార్మికులు మంగళవారం తమ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె ప్రారంభించారు. తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని, వేతనాలు పెంచాలని వారు డిమాండ్ చేస్తున్నారు. దీంతో నగరంలో 1,000 టన్నులకు పైగా చెత్త ... ముఖ్యంగా దీపావళి టపాసుల వ్యర్థాలు భారీగా పేరుకుపోయాయి. కార్మికుల వేతనాలు పెంచేందుకు తమిళనాడు ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని కలెక్టర్ జీఎస్ సమీరన్, కార్పొరేషన్ కమిషనర్ ఎం ప్రతాప్ హామీ ఇవ్వడంతో కార్మికులు కొద్దిరోజుల క్రితం సమ్మె విరమించారు. గత బుధవారం... పారిశుధ్య కార్మికుల సమస్యపై ప్రభుత్వానికి లేఖ రాయాలని మున్సిపల్ కార్పొరేషన్ తీర్మానాన్ని ఆమోదించింది. దీనిని కార్మికులు అంగీకరించకపోవడంతో వివిధ కార్మిక సంఘాలు మంగళవారం సమ్మెకు పిలుపునిచ్చాయి. కార్మికులు విధులు బహిష్కరించి కార్పొరేషన్ కార్యాలయం ఎదుట బైఠాయించి తమ డిమాండ్లకు మద్దతుగా నినాదాలు చేశారు.

ఆగస్టులో ఈఎస్ఐసీ పరిధిలోకి 14.60 లక్షల మంది

న్యూఢిల్లీ: ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) నిర్వహిస్తున్న సామాజిక భద్రతా పథకంలో 2022 ఆగస్టులో దాదాపు 14.62 లక్షల మంది కొత్త సభ్యులు చేరారు. ఈమేరకు సంస్థ మంగళవారం వెల్లడించింది. ఈఎస్ఐసీలో 2020-21లో స్థూలంగా కొత్త నమోదులు 1.15 కోట్లు ఉండగా, 2021-22లో 1.49 కోట్లకు పెరిగాయి. ఈ సంఖ్య 2019-20లో 1.51 కోట్లు, 2018-19లో 1.49 కోట్లుగా ఉంది. సెప్టెంబర్ 2017 నుండి మార్చి 2018 వరకు, దాదాపు 83.35 లక్షల మంది కొత్త చందాదారులు ఈఎస్ఐసీ పథకంలో చేరారు. సెప్టెంబర్ 2017 నుండి ఆగస్టు 2022 వరకు ఈఎస్ఐసీలో స్థూలంగా కొత్త నమోదులు 7.22 కోట్లని సంస్థ పేర్కొంది. ఈఎస్ఐసీ ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ), పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్డీఏ) ద్వారా నిర్వహిస్తున్న వివిధ సామాజిక భద్రతా పథకాల కొత్త చందాదారుల పేరోల్ డేటా ఆధారంగా ఈఎస్ఐసీ ఈ నివేదిక రూపొందించబడింది.

ఓటరు జాబితాల సరఫరాపై కేంద్రం, ఈసీకి నోటీసు

న్యూఢిల్లీ: ఎన్నికల సంఘం (ఈసీ) పోటీలో ఉన్న ప్రతి అభ్యర్థికి ఓటర్ల జాబితాకు సంబంధించి రెండు నకళ్లను ఉచితంగా సరఫరా చేయడంపై ఓటర్ల నమోదు నిబంధనల (1960)ను సవాల్ చేస్తూ... దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు... కేంద్ర ప్రభుత్వంతో పాటు ఎన్నికల కమిషనర్ నుంచి స్పందన కోరింది. పెద్ద మొత్తంలో వ్యయంతో పాటు కాగితం వినియోగాన్ని ఆదా చేయడానికి ప్రత్యామ్నాయం చూపాలని కోరుతూ ఇద్దరు న్యాయవాదులు హర్ష్యాన్ సింగ్ గెహ్లాట్, సంజనా గెహ్లాట్ ఈ పిటిషన్ దాఖలు చేయగా సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఓటరు జాబితాలను ముద్రించి, పోటీ చేస్తున్న గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులకు ఉచితంగా సరఫరా చేసేందుకు దేశం దాదాపు రూ.47.84 కోట్లను భరించాల్సి వచ్చిందని, ఓటరు జాబితాల ముద్రణ కోసం ప్రతిరోజూ దాదాపు 31 చెట్లను నరికివేస్తున్నట్లు పిటిషనర్లు పేర్కొన్నారు. ఓటర్ల నమోదు నిబంధనలు-1960లోని నిబంధనలు 11(సి), 22(సి)లను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యు.యు. లలిత్, బేల ఎం త్రివేదితో కూడిన ధర్మాసనం కేంద్రానికి, ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు నోటీసులు జారీ చేసింది.

జోడో యాత్రికులకు రాహుల్ దీపావళి కానుక

న్యూఢిల్లీ: తనతో పాటు భారత్ జోడో యాత్రలో పాల్గొంటున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆ పార్టీ ఎంపీ రాహుల్‌గాంధీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. భారత్ జోడో యాత్ర శిబిరంలో పనిచేస్తున్న యాత్రికులు, డ్రైవర్లు, కార్మికులకు పేరుపేరున అభినందనలు తెలిపారు. దీపావళి సందర్భంగా వెండి నాణేలు, మిఠాయిలు పంపించారు. భారతదేశ నిజమైన విలువలు విద్వేషాన్ని ఓడిస్తాయని రాహుల్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన లేఖ కూడా రాశారు. భారతదేశ విలువల పట్ల మనకు గల నమ్మకం మరింత ముందుకు తీసుకెళుతుందని రాహుల్ పేర్కొన్నారు. 'అందమైన భారత్ జోడో యాత్రలో మేము చేయి చేయి కలిపి నడుస్తున్నాం. మాటలు కాదు... చేతలే. చెప్పడం కాదు...చేయడమే, హామీలు ఇవ్వడం కాదు...అమలు చేసి నిరూపించడం. మీకు, మీ కుటుంబానికి సంతోషకరమైన దీపావళి' అని రాహుల్‌గాంధీ తన లేఖలో పేర్కొన్నారు. గాంధీ లేఖను కాంగ్రెస్ పార్టీ ట్విట్టర్‌లో పోస్టు చేసింది.

వీసీల రాజీనామాలు కోరే అధికారం గవర్నర్‌కు లేదు

కేరళ సీఎం విజయన్

తిరువనంతపురం : కేరళలోని 9 విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లు రాజీనామా చేయాలని గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ కోరడం పై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ సోమవారం మండిపడ్డారు. గవర్నర్‌కు అలాంటి అధికారాలు లేవని, రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికయిన ప్రభుత్వం, విద్యాపరంగా స్వతంత్రంగా ఉండాల్సిన విశ్వవిద్యాలయాల అధికారాలపై గవర్నర్ చర్య అతిక్రమించడమేనని ముఖ్యమంత్రి విమర్శించారు. రాష్ట్రంలోని తొమ్మిది వర్సిటీల వైస్ ఛాన్సలర్ల రాజీనామాను కోరుతూ ఖాన్ రాజకీయ తుఫానును ప్రారంభించిన ఒక రోజు తర్వాత, విజయన్ ఇది అసాధారణమైన చర్య అని అన్నారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలను 'నాశనం' చేయాలనే ఉద్దేశంతో 'యుద్ధం' చేస్తున్నారని ఆరోపించారు. ఈ తొమ్మిది విశ్వవిద్యాలయాలకు వీసీలను నియమించింది గవర్నర్ అని, ఈ నియామకాలు చట్టవిరుద్ధంగా జరిగితే, ప్రాథమిక బాధ్యత గవర్నర్‌దేనని, వారి రాజీనామాలు కోరే అధికారం ఛాన్సలర్‌కు లేదని ముఖ్యమంత్రి అన్నారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నిబంధనలకు విరుద్ధంగా ఏపీజే అబ్దుల్ కలాం టెక్నలాజికల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ (వీసీ) నియామకాన్ని రద్దు చేస్తూ ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలతో ఖాన్ ఆదివారం రాష్ట్రంలోని తొమ్మిది వర్సిటీల వీసీల రాజీనామాలను కోరారు.

నాలుగు టీవీ ఛానళ్లను నిషేధించిన కేరళ గవర్నర్

పత్రికా స్వేచ్ఛను హరించడమే : కేయూడబ్ల్యూజే నిరసన

తిరువనంతపురం : కేరళ గవర్నర్ కార్యాలయం సోమవారం తన విలేకరుల సమావేశాన్ని కవర్ చేయడానికి నాలుగు టెలివిజన్ ఛానళ్లను ఇక్కడి రాజ్‌భవన్‌లోకి ప్రవేశించకుండా నిషేధించింది. పత్రికా స్వేచ్ఛ పై ఆక్రమణ అని పేర్కొంటూ రాజకీయ పార్టీలు, కేరళ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (కేయూడబ్ల్యూజే) తమ నిరసనను తెలియజేశాయి. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ విలేకరుల సమావేశం ముగిసిన వెంటనే, జర్నలిస్టులు గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్ స్పందన కోసం ఆయనను సంప్రదించారు. అయితే జర్నలిస్టుల వలె 'వేషధారణ' చేస్తున్న పార్టీ కార్యకర్తలకు తాను సమాధానం చెప్పనంటూ ఆయన వ్యాఖ్యానించడానికి నిరాకరించారు. 'నేను మీకు మాత్రమే చెప్పగలను, దయచేసి నాతో మాట్లాడాలనుకునే వారు రాజ్‌భవన్‌కు అభ్యర్థన పంపగలరు, నేను మీతో మాట్లాడేలా చూసుకుంటాను. కానీ మీలో ఎవరు నిజమైన జర్నలిస్టు, ఎవరో నాకు తెలియదు. కార్యకర్తలు మీడియా ముసుగువేసుకుంటున్నారు. నేను కార్యకర్తలతో మాట్లాడాలనుకోలేదు' అని ఖాన్ తిరువనంతపురంలో జరిగిన ఒక కార్యక్రమం తర్వాత మీడియాతో అన్నారు. తర్వాత గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అయితే కైరాలి, రిపోర్టర్, మీడియా వన్, జైహింద్‌తో సహా ఛానళ్లను దానిని కవర్ చేయడానికి అనుమతి ఇవ్వలేదు. రాజ్యాంగబద్ధమైన పదవి అయిన గవర్నర్ తరపున మీడియాకు అనుమతి నిరాకరించడం సరికాదని, మీడియాను తప్పించడం ఫాసిస్ట్ విధానం అని, ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదని ప్రతిపక్ష నేత వీడీ సతీశన్ అన్నారు. కాగా ఛానళ్ల పై నిషేధానికి వ్యతిరేకంగా కేయూడబ్ల్యూజే నిరసన తెలిపింది. నిషేధం పత్రికా స్వేచ్ఛను హరించడమే. గవర్నర్ పట్టుబట్టిన విధంగా సమయం కోరిన మీడియా సంస్థలు ఉన్నాయి. మీడియాలోని ఒక వర్గంపై నిషేధాన్ని రాజ్యాంగ సంస్థ అంగీకరించదు. ఇదే కొనసాగితే, కేయూడబ్ల్యూజే తీవ్ర నిరసన చేపట్టవలసి వస్తుంది' అని కేయూడబ్ల్యూజే ఒక ప్రకటనలో పేర్కొంది.

కర్ణాటకలో లింగాయత్ మఠాధిపతి ఆత్మహత్య

రెండు పేజీల సూసైడ్ నోట్ లభ్యం

బ్లాక్‌మెయిల్ కోణం వెలుగులోకి...

రామనగర: కర్ణాటకలో మరో లింగాయత్ మఠాధిపతి బసవలింగ స్వామి (45) ఆత్మహత్య చేసుకున్నారు. కంచుగల్ బండె మఠానికి పీఠాధిపతిగా ఉన్న ఆయన మఠంలోని గదిలో సోమవారం ఉరివేసుకొన్నట్లు రామనగర జిల్లా పోలీసులు తెలిపారు. రెండు పేజీల సూసైడ్ నోట్ లభ్యమైందని, అందులో కొందరు తనను పదవి నుంచి తొలగించాలనే ఉద్దేశంతో వేధించినట్లు స్వామి పేర్కొన్నారన్నారు. దీంతో బ్లాక్‌మెయిల్ కోణం వెలుగులోకి వచ్చినట్లు చెప్పారు. ఒక మహిళతో జరిగిన సంభాషణే బ్లాక్‌మెయిల్‌కు కారణంగా పోలీసులు వెల్లడించారు. ఆత్మహత్య చేసుకునేలా స్వామిని ప్రోత్సహించారన్న కోణంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. బసవలింగ స్వామి ఈ మఠాన్ని 25ఏళ్లుగా నిర్వహిస్తున్నారు. 1997లో ఈ మఠం బాధ్యతలను చేపట్టగా ఇటీవల రజతోత్సవం చేసుకున్నారు. నిత్యం ఉదయం 4 గంటలకే నిద్రలేచి పూజ గది తలుపులను తెరిచేవారని, ఉదయం 6 గంటలైనా తలుపులు తెరుచుకోకపోవడంతో సిబ్బందికి అనుమానం కలిగిందని, ఫోన్ చేసినా, తలుపు తట్టినా స్పందన లేకపోవడంతో వారు వెనుక వైపు నుంచి వెళ్లి చూడగా ఆయన ఉరి వేసుకొన్నట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందజేశారని అధికారి తెలిపారు. తనను వేధించిన వారి పేర్లను సూసైడ్ నోట్‌లో స్వామి పేర్కొన్నట్లు తెలిపారుగానీ వాటిని వెల్లడించలేదు. స్వామి మృతదేహానికి పోస్టుమార్టం తదితరాల అనంతరం మఠంలోనే అంతిమ సంస్కారాలు సోమవారం సాయంత్రం ముగిసినట్లు అధికారి చెప్పారు. బసవలింగ స్వామి అనే పేరు ఉన్న చిలుమూ మఠాధిపతి కూడా ఇదే తరహాలో గతేడాది డిసెంబరులో ఆత్మహత్యకు పాల్పడ్డారు. క్షీణిస్తున్న ఆరోగ్య పరిస్థితిపై బెంగతో మానసిక కుంగుబాటుకు గురై ఆయన ప్రాణాలు తీసుకున్నట్లు అప్పట్లో నివేదికల్లో పేర్కొన్నారు.

తట్టుకోలేకపోతున్నా...

భర్త మరణంతో కిరణ్ మజుందార్ భావోద్వేగం

బెంగళూరు: బైకాన్ ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ కిరణ్ మజుందార్ షా ఇంట విషాదం చోటుచేసుకుంది. ఆమె భర్త జాన్‌షా (73) సోమవారం మరణించారు. కేన్సర్‌తో పోరాడుతూ బెంగళూరు ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. దీంతో కిరణ్ మజుందార్ భావోద్వేగానికి లోనయ్యారు. తన భర్త మరణాన్ని తట్టుకోలేకపోతున్నట్లు ట్విట్టర్ మాధ్యమంగా తన మనోగతిని వెల్లడించారు. 'నా భర్త, గురువు, సోల్‌మేట్ (ఆత్మీయుడు)ను కోల్పోయాను. ఈ విషాదాన్ని తట్టుకోలేకపోతున్నాను. జాన్ ఎల్లప్పుడూ నాతోనే ఉంటూ నా ప్రతి అడుగులో మార్గదర్శకత్వం వహిస్తారని నమ్ముతున్నాను. నా జీవితాన్ని ఎంతో ప్రత్యేకమైనదిగా మార్చిన మీకు రుణపడి ఉంటాను. నేను మిమ్మల్ని చాలా మిస్ అవుతాను. రెస్ట్ ఇన్ పీస్ మై డార్లింగ్ జాన్' అంటూ కిరణ్ ట్వీట్ చేశారు. జాన్ షా 22 ఏళ్ల పాటు బైకాన్ వైస్ చైర్మన్‌గా, నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేశారు. 2021 జులైలో రిటైరయ్యారు. బైకాన్ గ్రూపు కంపెనీల్లోని సలహా బోర్డులలో సభ్యునిగా కొనసాగారు. 1999లో బైకాన్‌లో చేరడానికి ముందు మధురా కోట్స్ తయారుచేసే కంపెనీని ఆయన నడిపేవారు. స్కాట్‌లాండ్‌కు చెందిన జాన్‌షా 1998లో కిరణ్‌ను పెళ్లి చేసుకున్నారు.

ప్రభుత్వ వెబ్‌సైట్లలో కొత్త ముసాయిదా చట్టాలు ఉంచడంపై...

31న సుప్రీంకోర్టు విచారణ

న్యూఢిల్లీ: చట్టసభల్లో ప్రవేశానికి కనీసం 60 రోజుల ముందు సంబంధిత ముసాయిదా శాసనాలను ప్రభుత్వ వెబ్‌సైట్లు లేదా ప్రజాధికార పరిధిలో ఉంచాలని కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలివ్వాలన్న పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం విచారణకు స్వీకరించింది. ఈ వ్యవహారాన్ని 31న ప్రధాన న్యాయమూర్తి యూయూ లలిత్, జస్టిస్ ఎస్ఆర్ భట్, జస్టిస్ బేలా ఎం త్రివేదితో కూడిన ధర్మాసనం విచారించనున్నట్లు సుప్రీంకోర్టు వెబ్‌సైట్ పేర్కొంది. ఈ పిటిషన్‌ను న్యాయవాది అశ్విని కుమార్ ఉపాధ్యాయ దాఖలు చేశారు. నేటి ప్రజాస్వామిక ప్రక్రియలో అత్యాధునిక మీడియా, టెక్నాలజీ వినియోగం క్రమంలో ప్రభుత్వాలు (కేంద్రం-రాష్ట్రం) ఆకస్మికంగా లేక రాత్రికిరాత్రే శాసనాలను పార్లమెంటు/అసెంబ్లీలో ప్రవేశపెట్టి చర్చలు, సంప్రదింపులు లేకుండా ఆమోదించడాన్ని పిటిషన్ వ్యతిరేకించింది. ప్రతిపాదిత చట్టాల గురించి ప్రజలకు అవగాహన కలిగే విధంగా వాటిని ప్రవేశపెట్టేందుకు 60 రోజుల ముందు ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ఉంచడం, ప్రాంతీయ భాషల్లో అనువదించడం సబబుగా ఉంటుందని సూచించింది. కనీసం కేంద్ర చట్టాల విషయంలోనైనా ఇలా చేయాలన్నది. 'అమలవుతున్నది అప్రజాస్వామిక, రాజ్యాంగ విరుద్ధమైన చట్టాల రూపకల్పన ప్రక్రియ కాబట్టి ప్రజలకు నష్టం కలుగుతున్నది. ముసాయిదా బిల్లులను సంబంధిత మంత్రిత్వశాఖల కార్యదర్శులు రూపొందించగా, విస్తృతంగా చర్చలు, ప్రజాభిప్రాయంతో ప్రమేయం లేకుండా మంత్రిమండలి వాటిని ఆమోదిస్తోంది. పార్లమెంటు, అసెంబ్లీలో చర్చ లేక ఆమోదం తర్వాతే ఆయా బిల్లుల గురించి ప్రజలకు తెలుస్తోంది' అని ఫిర్యాదు పేర్కొంది. ఉన్న చట్టాలను సవరించి కొత్త చట్టాలను కేంద్రప్రభుత్వం చేస్తోందని, దీంతో వనరులే కాకుండా చట్టసభల సమయం వృథా అవుతున్నట్లు పిటిషన్ నొక్కిచెప్పింది. చట్టాల రూపకల్పన విధానంలో మార్పులు అవసరమని పేర్కొంది. కొత్త చట్టాలపై రెండు నెలల పాటు ప్రజలతో సంప్రదింపులు, చర్చలు జరిపితే అందులోని ప్రతి అంశాన్ని విశ్లేషించేందుకు సంబంధిత ఎగ్జిక్యూటివ్‌కు అవకాశం ఉంటుందని ఫిర్యాదు సూచించింది.

ఎన్‌డీఏతో నితీశ్ కలవడు: తేజస్వి

పాట్నా: తమ ప్రభుత్వ అధినేత, ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్‌పై ఆర్‌జేడీ నాయకుడు, ఉపముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ పూర్తి విశ్వాసం వెలిబుచ్చారు. నితీశ్‌కుమార్ తిరిగి ఎన్‌డీఏ గూటికి చేరతారన్న ప్రచారాన్ని తేజస్వి నిర్ద్వంద్వంగా కొట్టిపారేశారు. బీహారులో మహాకూటమి ప్రభుత్వం చాలా బలంగా ఉందని స్పష్టంచేశారు. భాగస్వామ్యపక్షాల సంపూర్ణ మద్దతుతో తమ పార్టీ పూర్తి సంతోషంగా ఉందని ఆయన చెప్పారు.

వచ్చేవారం రెండు సీట్లకు జరిగే ఉప ఎన్నికల్లో మహాకూటమి అభ్యర్థులు ఘనవిజయం సాధిస్తారని ధీమాగా చెప్పారు. 'రెండు సీట్లలో పోటీ చేయాలని భాగస్వామ్య పార్టీలన్నీ నిర్ణయించాయి. మొకమ తమ సిట్టింగ్ సీటు అని, గోపాల్‌గంజ్ తన సొంత జిల్లా అని ఆయన చెప్పారు. రెండు సీట్లను మహాఘట్బంధన్ గెలుచుకుంటుందని తెలిపారు. తేజస్వి సోమవారం జెహనాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ నితీశ్‌కుమార్ బీజేపీ వైపు చూసే ప్రసక్తేలేదని తేల్చిచెప్పారు. ఆయుధాలు, పేలుడు పదార్థాల కేసులో శిక్షకు గురైన అనంతకుమార్ సింగ్ అనర్హత ఎదుర్కోవడంతో మొకమ సీటుకు ఉప ఎన్నిక జరుగుతుంది. ఆయన భార్య నీలం దేవి ఇక్కడ నుంచి పోటీ చేస్తున్నారు. బీజేపీ ఎమ్మెల్యే మృతితో గోపాల్‌గంజ్ సీటుకు ఎన్నిక అనివార్యమైంది. ఇక్కడ బీజేపీ అభ్యర్థిగా కుసుం దేవి పోటీ చేస్తుండగా ఆర్‌జేడీ తరపున మోహన్ గుప్తా పోటీ చేస్తున్నారు.

విశ్వ గురువుగా భారత్: ఉపరాష్ట్రపతి

జైపూర్: భారత్ మరోసారి విశ్వ గురువు కావడానికి అన్ని అవకాశాలు ఉన్నాయని, అందుకు సరైన విద్య, ఆలోచనా విధానం అవసరమని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ చెప్పారు. బ్రహ్మకుమారిల 85వ వార్షికోత్సవంలో మంగళవారం ఉపరాష్ట్రపతి ప్రసంగించారు. రానున్న దశాబ్దకాలంలో భారత్ ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని ధన్కర్ ఆశాభావం వెలిబుచ్చారు. 'సరైన విద్య, సరైన ఆలోచన విధానం, సరైన విజ్ఞానం మనకు మరింత శక్తినిస్తాయి' అని ఆయన పేర్కొన్నారు. గతంలో భారత్ విశ్వగురువుగా అవతరించిందని, భవిష్యత్‌లో మరోసారి విశ్వ గురువు కావడానికి అన్ని హంగులు ఉన్నాయన్నారు. 'మన కల త్వరలోనే వాస్తవరూపం దాల్చబోతుంది. మన విద్యాసంస్థలు ప్రపంచానికి మార్గనిర్దేశం చేస్తున్నాయి. ప్రపంచ చరిత్రలో భారత్ మినహా మరే దేశం వాస్తవికత, శాంతి సందేశం ఇవ్వలేదు' అని ధన్కర్ తెలిపారు. సంస్కృతి, ఆలోచనలు, వారసత్వాన్ని దృష్టిలో పెట్టుకొని జాతీయ విద్యావిధానానికి రూపకల్పన చేశామని, విద్య అత్యంత కీలకమైనందున దేశం సరికొత్త దిశలో పయనిస్తుందని చెప్పారు. కరోనా కష్టకాలంలోనూ భారతదేశం యావత్ ప్రపంచానికి సేవలందించిందని గుర్తుచేశారు. ప్రస్తుతం భారత్ ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారిందని, దశాబ్దకాలంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుందని ఆయన పేర్కొన్నారు.

అనీ రాజాకు వడక్కిల్లం గోవిందన్ నంబూద్రి అవార్డు

కన్నూరు: సామాజిక సేవ, రాజకీయాలలో విశేష సేవలందించినందుకుగాను భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) ప్రధాన కార్యదర్శి, సీపీఐ నాయకురాలు అనీ రాజాను వడక్కిల్లం గోవిందన్ నంబూద్రి అవార్డుకు ఎంపిక చేశారు. అవార్డు కమిటీ కార్యదర్శి, వడక్కిల్లం గోవిందన్ నంబూద్రి తనయుడు మాధవన్ పురచేరి ఈ అవార్డును ప్రకటించారు. సామాజిక, సేవ, రాజకీయాలు, సాహిత్యం, కళలు సహా వివిధ రంగాల ప్రముఖులకు ప్రదానం చేయడం కోసం ఈ అవార్డును ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ అవార్డు కింద అనీ రాజాకు రూ.25 వేల నగదు, సర్టిఫికెట్, ప్రముఖ శిల్పి కేకేఆర్ వంగర రూపొందించిన జ్ఞాపికను అందజేస్తారు. నవంబరు మొదటి వారంలో అవార్డుల ప్రదానోత్సవం జరుగుతుందని మాధవన్ పురచేరి తెలిపారు. నలుగురు సభ్యుల అవార్డు కమిటీకి ప్రముఖ రచయిత యూకే కుమారన్ చైర్మన్‌గా ఉన్నారు. కేకే మరార్, వి.అయిషా బీవీ సభ్యులుగా ఉన్నారు. నవయుగం వారపత్రికతో తనకు గల అనుబంధం దృష్ట్యా వడక్కిల్లం గోవిందన్ నంబూద్రిని నవయుగం నంబూద్రి అని కూడా పిలుస్తారు. స్వాతంత్ర్య సమరయోధుగా కాంగ్రెస్ రాజకీయాలతో తన జీవితాన్ని ప్రారంభించిన నంబూద్రి... తర్వాత ఉత్తర మలబార్‌లో కమ్యూనిస్టు ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. 1964లో కమ్యూనిస్టు పార్టీ చీలికతో ఆయన సీపీఐలో కొనసాగారు. 1994 అక్టోబరు 15న మరణించేంత వరకూ ఆయన పార్టీతోనే ఉన్నారు.

ఆకాశంలో అద్భుత ఘట్టం

భారత్‌లో పాక్షికంగా సూర్యగ్రహణం

న్యూదిల్లీ: తెలుగు రాష్ట్రాలు సహా దేశంలోని అనేక ప్రాంతాల్లో సూర్యగ్రహణం పాక్షికంగా కనిపించింది. అయితే కొన్ని ఇతరదేశాల్లో గ్రహణం చూపరులకు కనువిందు చేసింది. మన దేశంలోనూ పలు ప్రాంతాల నుంచి ఈ గ్రహణాన్ని చూశారు. తెలుగు రాష్ట్రాల్లో సైతం అనేక ప్రాంతాల్లో పాక్షిక సూర్య గ్రహణం దర్శనమిచ్చింది. ఈ గ్రహణం జైపూర్, నాగ్ పూర్, ద్వారక, చెన్నై, ముంబై, కోల్‌కతా తదితర నగరాల్లో కనిపించింది. సాయంత్రం 4.29 గంటలకు సూర్యగ్రహణం ప్రారంభమైంది. సాయంత్రం 6.26 గంటల వరకు కొనసాగింది. ఈ గ్రహణాన్ని అరుదైన ఖగోళ విచిత్రంగా చెప్పుకోవచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు. ఎందుకంటే చాలా ఏళ్ల వరకు ఇలాంటి గ్రహణం మళ్లీ కనిపించదని వారంటున్నారు. తెలుగు రాష్ట్రాల్లో 49 నిమిషాల పాటు గ్రహణం కనిపించింది. భారత దేశంలో తదుపరి సూర్యగ్రహణం 2027 ఆగస్టు 2న కనిపిస్తుందని ఖగోళ శాస్త్రవేత్తలు వెల్లడించారు. సాయంత్రం 4.29గంటలకు దిల్లీలో సూర్యగ్రహణం ప్రారంభం కాగా, 4.59 గంటలకు హైదరాబాద్‌లో మొదలైంది. విజయవాడలో 4.49గంటలకు, తిరుపతిలో 5.01గంటలకు సూర్యగ్రహణం మొదలైంది. కోల్‌కతాలో సాయంత్రం 4.52 గంటలకు, చెన్నైలో సాయంత్రం 5.14 గంటలకు, ముంబైలో 4.49 గంటలకు, ద్వారకలో 4.36 గంటలకు, తిరువనంతపురంలో 5.29 గంటలకు, నాగ్‌పూర్‌లో 4.49 గంటలకు గ్రహణం మొదలైంది. గ్రహణాన్ని నేరుగా కంటితో చూడటం ప్రమాదకరమని నిపుణులు హెచ్చరించడంతో ప్రత్యేక పరికరాల సాయంతో వీక్షించారు. అనేకచోట్ల పిల్లలు, పెద్దలు వివిధ జాగ్రత్తలతో గ్రహణాన్ని ప్రత్యక్షంగా చూడ్డానికి ఉత్సాహం చూపారు. టీవీ ఛానెల్స్.. సూర్య గ్రహణాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశాయి. హైదరాబాద్ లోని బిర్లా ప్లానిటోరియంలో సూర్యగ్రహణం వీక్షించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో ఔత్సాహికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఇందుకోసం రెండు భారీ టెలిస్కోప్‌లు ఏర్పాటు చేశారు. క్యూలైన్‌లో నిల్చొని ఒక్కొక్కరు టెలిస్కోప్ ద్వారా గ్రహణాన్ని వీక్షించారు. టెలిస్కోప్‌ను ప్రాజెక్టర్‌కు అనుసంధానం చేసి తెరపైనా వీక్షించే విధంగా ఏర్పాట్లు చేశారు. మరికొందరు బ్లాక్ కలర్ ఫిల్మ్ ద్వారా గ్రహణాన్ని చూశారు. సూర్యగ్రహణం కారణంగా తెలుగు రాష్ట్రాల్లోని ఆలయాలన్నింటినీ మూసివేశారు. సంప్రోక్షణ తర్వాత భక్తులను తిరిగి దర్శనానికి అనుమతించనున్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు సహా దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ప్రజానీకం నదుల్లో గ్రహణం విడుపు స్నానాలు ఆచరించారు.

ఆ తొమ్మిది మంది వీసీలు ఎవరంటే...

తిరువనంతపురం: యూజీసీ నిబంధనలను ఉల్లంఘించారని ఆరోపిస్తూ కేరళలోని తొమ్మిది విశ్వవిద్యాల యాల వైస్ ఛాన్సలర్లు (వీసీలు) తమ పదవులకు రాజీనామా చేయాలని రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల ఛాన్సలర్‌గా వ్యవ హరిస్తున్న గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ కోరారు. సోమవారం ఉదయం 11.30 గంటల వరకు వీసీలు రాజీనామాలు సమర్పించకపోవడంతో నవంబర్ 3లోగా సమాధానం ఇవ్వాలని కోరుతూ ఛాన్సలర్ వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న వారిలో డాక్టర్ వి.పి.మహదేవన్ పిళ్లై కేరళ విశ్వవిద్యాలయం వీసీ, మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ సాబు థామస్, కొచ్చిన్ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ కె.ఎన్.మధుసూదనన్, కేరళ మత్స్య, సముద్ర అధ్యయన విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ కె.రిజ్జి జాన్, కన్నూర్ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ గోపీనాథ్ రవీంద్రన్, డాక్టర్ ఎం.ఎస్.రాజశ్రీ ఏపీజే అబ్దుల్ కలాం టెక్నలాజికల్ విశ్వవిద్యాలయం వీసీ, శ్రీ శంకరాచార్య సంస్కృత విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఎంవీ నారాయణన్, కాలికట్ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఎం.కె.జయరాజ్, తుంచతేరుఖుతాచన్ మలయాళ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ వి.అనిల్ కుమార్ ఉన్నారు.

మరో రెండు వర్సిటీల

వీసీలకు షోకాజ్ నోటీసు

4లోగా సమాధానం ఇవ్వాలన్న కేరళ గవర్నర్

తిరువనంతపురం: కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ మంగళవారం యూజీసీ నిబంధనలను ఉల్లంఘించారని ఆరోపిస్తూ, ఆ పదవిని నిర్వహించేందుకు తనకు న్యాయపరమైన హక్కు ఏమిటంటూ శ్రీనారాయణగురు ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌కు, కేరళ డిజిటల్ సైన్సెస్, ఇన్నోవేషన్-టెక్నాలజీ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ సాజి గోపీనాథ్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. గత వారం, ఇతర తొమ్మిది కేరళ విశ్వవిద్యాలయాల వీసీలను తమ కార్యాలయాల నుంచి వైదొలగాలని ఖాన్ కోరిన నేపథ్యంలో షోకాజ్ నోటీసు వచ్చింది. ఖాన్ కోరినట్లుగా సోమవారం ఉద యం 11.30 గంటలకు వీసీలు తమ రాజీనామాలను పంపకపో వడంతో అక్టోబరు 21 సుప్రీం కోర్టు ఆదేశాలను అనుసరించి సంబంధిత కార్యాలయాల్లో కొనసాగడానికి వారికి ఎలాంటి చట్టపరమైన హక్కు ఉందో నవంబర్ 3లోగా సమాధానం ఇవ్వా లని కోరుతూ వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నవంబర్ 4లోగా స్పందించాలని కోరుతూ శ్రీనారాయణగురు ఓపెన్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ పి.ఎం.ముబారక్ పాషాకు ఇప్పుడే ఇదే నోటీసు పంపారు. సుప్రీం కోర్టు తీర్పును దృష్టిలో ఉంచుకుని శ్రీనారాయణగురు ఓపెన్ యూనివర్సిటీ వీసీగా మీ నియామకం యూజీసీ నిబంధనలకు విరుద్ధమని, చట్టానికి వ్యతిరేకమని ప్రాథమికంగా గుర్తించినట్లు నోటీసులో పేర్కొన్నారు. యూనివ ర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ప్రకారం రాష్ట్రం ఏర్పాటు చేసిన సెర్చ్ కమిటీ ఛాన్సలర్‌కి ఇంజినీరింగ్ సైన్స్ రంగంలోని ప్రముఖులలో కనీసం ముగ్గురు వ్యక్తులతో కూడిన ప్యానెల్‌ను సిఫారసు చేసి ఉండాల్సిందని సుప్రీం కోర్టు అక్టోబర్ 21న ఏపీజే అబ్దుల్ కలాం టెక్నలాజికల్ యూనివర్సిటీ వీసీ నియామకాన్ని రద్దు చేసింది. కానీ, బదులుగా అది ఒకరి పేరును మాత్రమే పంపింది.

మత ఘర్షణలకు కుట్రా?

- శివమొగ్గలో యువకుడిపై దుండగుల దాడి
- పోలీసు బలగాల మోహరింపు

శివమొగ్గ: త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న కర్ణాటకలో మత ఘర్షణలకు కుట్రలు జరుగుతున్నాయి. మత విద్వేషాలు సృష్టించడం ద్వారా రాజకీయ లబ్ధికోసం కొన్ని పార్టీలు ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తున్నాయి. ఇటీవల కాలంలో ఓ హిందూ కార్యకర్త దారుణహత్యకు గురయ్యాడు. తాజాగా సోమవారం శివమొగ్గలో 25 ఏళ్ల యువకుడిపై ముగ్గురు గుర్తుతెలియని దుండగులు దాడి చేశారు. విచక్షణారహితంగా కొట్టారు. తీవ్రంగా గాయపరిచారు. అంతటితో ఆగకుండా ఆర్ఎస్ఎస్, హిందూ సంస్థలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. యువకుడిపై దాడితో పోలీసులు అప్రమత్తమయ్యారు. భద్రతను కట్టుదిట్టం చేశారు. శివమొగ్గలో బలగాలను మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. దుండగులు స్థానికులు కాదని బాధితుడు ప్రకాశ్ చెప్పారు. ఇటీవల హిందూత్వ సిద్ధాంతకర్త వీడీ సావర్కర్ కార్యక్రమానికి తాను హాజరయ్యానని ప్రకాశ్ తెలిపారు. నిందితులు మోటార్ బైక్‌పై వచ్చి దాడి చేసినట్లు పోలీసులు చెప్పారు. దుండగులు రాళ్లు విసరడంతోపాటు ఆర్ఎస్ఎస్, హిందూత్వ కార్యకర్తలకు వ్యతిరేకంగా నినాదాలు చేసినట్లు వెల్లడించారు. దాడిలో గాయపడిన ప్రకాశ్‌ను ఆసుపత్రికి తరలించామని, ప్రాణాపాయం లేదని చెప్పారు. నిందితులను గుర్తించడానికి సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. బస్టాండ్ నుంచి తిరిగి ఇంటికొస్తుండగా దుండగులు తనపై దాడి చేసినట్లు బాధితుడు వివరించారు. దాడి ఎందుకు చేశారో తనకు తెలియదని, తనకు ఎవరూ శత్రువులు లేరని, ఏ సంస్థతోనూ తనకు సంబంధం లేదని ప్రకాశ్ చెప్పుకొచ్చారు. 'ఇద్దరు దుండగులు చేతులతో పిడిగుద్దులు గుద్దారు. తర్వాత రాళ్లతో కొట్టారు. ఆర్ఎస్ఎస్, హిందూ కార్యకర్తలకు వ్యతిరేకంగా అసభ్య పదజాలం ప్రయోగించారు. ఇద్దరు నాపై దాడి చేయగా మరొకడు బైక్‌పై ఉన్నాడు. దుండగుల దాడితో నేను కిందపడిపోయాను. అయినా వదిలిపెట్టలేదు. కొద్దిసేపటికి నేను పైకి లేచాను. ముఖంపై గుద్దారు. తలపైనా బలంగా కొట్టారు సమీపంలోని మా ఇంటికి పరుగులు తీశాను. దుండగులు నన్ను వెంటాడారు. రాళ్లతో దాడి చేశారు. మా అమ్మ తలుపు తీయండంతో ఇంట్లోకి పరుగులు తీశాను' అని బాధితుడు ప్రకాశ్ విలేకరులకు చెప్పాడు. సీనియర్ పోలీసు అధికారులు ఘటనాస్థలిని సందర్శించారు. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, పరిస్థితి అదుపులోనే ఉందని శివమొగ్గ ఎస్పీ మిథున్ కుమార్ చెప్పారు. అధికారులు, సిబ్బందిని మోహరించామని, చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, పెట్రోలింగ్ కొనసాగుతోందని ఆయన వివరించారు. నిందితులను ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలేది లేదన్నారు. కొంతమందిపై అనుమానం ఉందని, అయితే విచారణ జరుగుతున్నందున పేర్లు వెల్లడించలేమన్నారు.

షిండే వర్గంలో అసంతృప్తి

- బీజేపీ వైపు 22 మంది ఎమ్మెల్యేల చూపు
- త్వరలో పార్టీ మారతారు: సామ్నా

ముంబై: మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే శిబిరంలోని మెజార్టీ ఎమ్మెల్యేలు అసంతృప్తితో ఉన్నారనీ, వారంతా త్వరలో బీజేపీలో చేరబోతు న్నారని ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన తెలిపింది. షిండే శిబిరంలో మొత్తంగా 40 మంది ఎమ్మెల్యేలు ఉండగా వారిలో 22మంది బీజేపీలో చేరబోతున్నారని ఉద్ధవ్ వర్గానికి చెందిన అధికారిక పత్రిక 'సామ్నా' పేర్కొంది. ఏక్‌నాథ్ షిండేను సీఎంని చేయడం తాత్కాలిక ఏర్పాటులో భాగమేనని, ఆయన ధరించిన సీఎం యూనిఫాంని ఎప్పుడైనా తొలగిస్తారని ప్రస్తుతం అందరికీ తెలిసిపోయిందని సంపాదకీయం పేర్కొంది. "ఏ క్షణంలోనైనా షిండే ముఖ్యమంత్రి యూనిఫాం తొలగించే అవకాశం ఉందని అందరికి అర్థమైంది. అంధేరి ఈస్ట్ ఉపఎన్నికల్లో షిండే వర్గం తన అభ్యర్థిని నిలబెట్టాల్సి ఉన్నది. అయితే బీజేపీ దానిని అడ్డుకున్నది. ఇక ఈ మధ్యే జరిగిన గ్రామ పంచాయతీ, సర్పంచ్ ఎన్నికల్లో విజయంపై వారు చెప్పేదంతా అబద్ధం, వాస్తవానికి షిండే వర్గంలోని సుమారు 22 మంది ఎమ్మెల్యేలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు" అని సంపాదకీయం తెలిపింది. వారిలో అత్యధికులు ఏక్షణమైనా బీజేపీలో చేరే అవకాశం ఉందని పేర్కొన్నది. బీజేపీ తన స్వార్థం కోసం షిండేని వాడుకుంటున్నదని విమర్శించింది. వాస్తవానికి ప్రభుత్వం తరఫున అన్ని నిర్ణయాలు మాజీ సీఎం, ప్రస్తుత ఉపముఖ్యమంత్రి ఫడ్నవీస్ తీసుకుంటున్నారని, వాటిని షిండే ప్రకటిస్తాడని పేర్కొంది. షిండే తనకు తానే కాకుండా రాష్ట్రానికి కూడా తీవ్ర నష్టంచేశారని 'సామ్నా' ఆగ్రహం వ్యక్తంచేసింది. షిండేను రాష్ట్రం క్షమించదని పేర్కొంది.

కాంతారా చిత్రానికి కొత్త చిక్కు

పాట కాపీచేశారని కేరళ బ్యాండ్ ఫిర్యాదు

హైదరాబాద్: కన్నడ నాట అపూర్వ విజయంతో పాన్ ఇండియా చిత్రంగా మారిన కాంతారా చిత్రానికి కొత్త చిక్కొచ్చింది. రిషబ్ శెట్టి హీరోగా, ఆయన దర్శకత్వంలో వచ్చిన కాంతారా సూపర్ హిట్ టాక్ తెచ్చుకుని, కలెక్షన్ల పరంగా దూసుకుపోతోంది. ఈ చిత్రంలోని కొన్ని సంప్రదాయాలపై ఇటీవల కొన్ని వివాదాలు వచ్చాయి. తాజాగా ఈ చిత్రంలోని ఒక పాటపై ఏకంగా కాపీరైట్ ఉల్లంఘన ఆరోపణలు వస్తున్నాయి. కాంతారా చిత్రంలో వరాహ పాట ప్రజాదరణ పొందింది. ఈ పాట తమ పాటకు కాపీకి అని కేరళకు చెందిన ప్రముఖ మ్యూజిక్ బ్యాండ్ తైక్కుడం బ్రిడ్జి ఆరోపిస్తోంది. వరాహ రూపం పాటను ఐదారేళ్ల క్రితమే నవరసం పేరుతో ఈ మ్యూజిక్ బ్యాండ్ విడుదల చేసింది. కాగా యూట్యూబ్‌లో ఈ పాటకు 42 లక్షల వ్యూస్ ఉన్నాయి. ఈ నవరస పాట, వరాహ రూపం రెండింటిని చూస్తే పెద్దగా తేడా అనిపించదు. నవరస పాటలోని ఆర్కెస్ట్రాను కాంతారాలోని వరాహారూపం పాటకు యథాతథంగా తీసుకున్నారని మ్యూజిక్ బ్యాండ్ తెక్కుడం బ్రిడ్జి చెబుతోంది. ఈ పాటను ఉపయోగించుకుంటున్నందుకు కనీసం తమకు కృతజ్ఞత కూడా తెలపలేదని అంటోంది. దీనిపై న్యాయపోరాటం చేస్తామని ప్రకటించింది. దీనికి సంబంధించిన ఫిర్యాదును తమ అధికారిక సోషల్ మీడియాలో షేర్ చేసిన తైక్కుడం బ్రిడ్జి దీనికి కాంతార సినిమా నిర్మాత, సంగీత దర్శకుడు, దర్శకులను ట్యాగ్ చేసింది కాగా, కాంతారా చిత్ర సంగీత దర్శకుడు అజనీశ్ ఈ ఆరోపణలను కొట్టిపారేశారు. రెండు పాటల్లో ఒకే రాగం ఉపయోగించడం వల్ల ఒకేలాగా అనిపిస్తోందని అంటున్నారు. అయితే సినిమా నిర్మాతలు, దర్శకుడు ఇంకా ఈ ఆరోపణలపై స్పందించలేదు.

'లైగర్' పంపిణీదారులపై పూరి జగన్నాథ్ ఆగ్రహం

హైదరాబాద్: బాక్సాఫీస్ వద్ద 'లైగర్' పరాజయం దర్శకుడు పూరి జగన్నాథ్‌ను ఇబ్బంది పెడుతోంది. ఈ సినిమాతో పూరీతో పాటు బయ్యర్లు కూడా కోట్లలో నష్టపోయారు. మరోవైపు, సినిమా నష్టాలను మిగల్చడంతో తమ పరిస్థితి ఏమిటని పూరి జగన్నాథ్‌ను బయ్యర్లు అడగడం మొదలు పెట్టారు. దీంతో కొన్ని రోజులు ఓపిక పడితే ఎంతో కొంత సర్దుబాటు చేస్తానని వారికి పూరి చెప్పారు. అయితే, పూరి నుంచి డబ్బులు అందకపోవడంతో... ధర్నా చేస్తామంటూ ఆయనను బెదిరించడం మొదలు పెట్టారు. దీనికి సంబంధించి బయ్యర్లు, పూరి మధ్య జరిగిన సంభాషణ ఆడియో లీక్ అయింది. 'ఏంటి బ్లాక్ మెయిల్ చేస్తున్నారా?' అంటూ బయ్య ర్లను పూరి ప్రశ్నించారు. తాను ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం కూడా లేదని చెప్పారు. ఒక నెలలో డబ్బులు ఇస్తానని చెప్పినప్పటికీ అతి చేస్తే... డబ్బులు ఇవ్వాలనిపించదని అన్నారు. సినిమా అంటేనే గ్యాంబ్లింగ్ అని, ఒకసారి సినిమా హిట్ అయితే, మరోసారి ఫ్లాప్ అవుతుందని చెప్పారు. ఒకసారి సినిమా హిట్ అయితే బయ్యర్ల నుంచి డబ్బులు తీసుకోవడానికి తాము ఎంతో తిరగాలని అన్నారు. పోకిరి నుంచి ఇస్మార్ట్ శంకర్ వరకు బయ్యర్ల నుంచి తనకు రావాల్సిన డబ్బు చాలా ఉందని చెప్పారు. ఆ డబ్బును తనకు బయ్యర్స్ అసోసియేషన్ వసూలు చేసి పెడుతుందా? అని ప్రశ్నించారు. ధర్నా చేసేవాళ్ల లిస్ట్ తీసుకుంటానని, వాళ్లకు ఒక్క రూపాయి కూడా ఇవ్వను... మిగతా వాళ్లకే ఇస్తానని చెప్పారు. పూరి మాట్లాడిన ఈ ఆడియో ఇప్పుడు సంచలనంగా మారింది.

రెట్టించిన ఉత్సాహంతో టీమిండియా

సిడ్నీ: టీ20 క్రికెట్ ప్రపంచకప్‌లో భాగంగా పాకిస్తాన్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో అద్భుత విజయం సాధించిన టీమిండియా రెట్టించిన ఉత్సాహంతో నెదర్లాండ్స్‌తో గురువారం జరిగే మలి పోరుకు సిద్ధమవుతోంది. ఈ క్రమంలోనే ఆటగాళ్లు సిడ్నీ క్రికెట్ మైదానంలో మంగళవారం హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్, బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్ పర్యవేక్షణలో నెట్ ప్రాక్టీస్ చేశారు. కెప్టెన్ రోహిత్ శర్మ, కేఎల్ రాహుల్, కోహ్లి, పంత్, చాహల్ తదితర ఆటగాళ్లు హుషారుగా ప్రాక్టీస్‌లో పాల్గొన్నారు. అయితే సూర్యకుమార్, యాదవ్, హార్దిక్ పాండ్య, షమీ, భువనేశ్వర్ కుమార్, అర్షదీప్ సింగ్ మాత్రం విశ్రాంతి తీసుకున్నారు. ఈ ప్రాక్టీస్‌లో అశ్విన్, చాహల్ బంతులను రాహుల్-దినేశ్ కార్తిక్ ఎదుర్కొన్నారు. అలాగే కార్తిక్, కోహ్లి కలిసి త్రో-డౌన్స్ ప్రాక్టీస్ చేశారు. విఫలమైన రోహిత్ శర్మ-రాహుల్ క్రిస్ప్ డ్రైవ్స్ బాగా ప్రాక్టీస్ చేశారు. పంత్ కూడా నెట్స్‌లో మంచి షాట్లు ఆడుతూ కనిపించాడు.

లంకపై ఆసీస్ అలవోక విజయం

స్టోయినిస్ మెరుపులు...17 బంతుల్లో అర్ధశతకం

పెర్త్: స్వదేశంలో జరుగుతున్న టీ20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా తొలి విజయం అందుకుంది. తన మొదటి మ్యాచ్ లో న్యూజిలాండ్ చేతిలో ఓడిన ఆసీస్... మంగళవారం శ్రీలంకపై జరిగిన రెండో మ్యాచ్‌లో ఘన విజయం సాధించింది. తొలుత శ్రీలంక నిర్దేశించిన 159 పరుగుల లక్ష్యాన్ని 16.3 ఓవర్లలోనే ఛేదించింది. ఆసీస్ ఆల్ రౌండర్ మార్కస్ స్టోయినిస్ (18 బంతుల్లో 59 నాటౌట్, 4 ఫోర్లు, 6 సిక్సర్లు) లంక బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఆరోన్ ఫించ్ కూడా రాణించడంతో ఆసీస్ సునాయాస విజయం అందుకుంది. టాస్ ఓడి బ్యాటింగ్ కు వచ్చిన శ్రీలంకకు పాట్ కమిన్స్ తన తొలి ఓవర్లోనే షాకిచ్చాడు. లంక ఇన్నింగ్స్ రెండో ఓవర్లో ఐదో బంతికి కుశాల్ మెండిస్ (5) మిచెల్ మార్ష్ కు క్యాచ్ ఇచ్చాడు. ఆ తర్వాత లంక ఓపెనర్ పతుమ్ నిస్సంక (45 బంతుల్లో 40, 2 ఫోర్లు)తో కలిసి ధనంజయ డిసిల్వా (23 బంతుల్లో 26, 3 ఫోర్లు) స్కోరుబోర్డును ముందుకు నడిపించారు. ఇద్దరూ కలిసి రెండో వికెట్ కు 69 పరుగులు జోడించారు. ఆస్టిన్ అగర్ వేసిన 11 ఓవర్ మూడో బంతికి లేని పరుగు కోసం యత్నించిన ధనంజయ డిసిల్వా రనౌట్ అయ్యాడు. ఆ తర్వాత లంక వరుసగా వికెట్లను కోల్పోయింది. 13 ఓవర్ మూడో బంతికి పతుమ్ నిస్సంక కూడా రనౌట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత వచ్చిన భానుక రాజపక్స (7) ను మిచెల్ స్టార్క్ ఔట్ చేశాడు. 15 ఓవర్లకు లంక స్కోరు 4 వికెట్ల నష్టానికి 106 పరుగులకు చేరింది. ఈ తరుణంలో కెప్టెన్ దసున్ శనక (3), హసరంగ (1) కూడా విఫలమయ్యారు. వరుసగా వికెట్లు కోల్పోతున్నా చరిత్ అసలంక (25 బంతుల్లో 38 నాటౌట్, 3 ఫోర్లు, 2 సిక్సర్లు).. చమీక కరుణరత్నె (7 బంతుల్లో 14 నాటౌట్, 2 ఫోర్లు) లంక స్కోరును 150 పరుగులు దాటించారు. చివరకు నిర్ణీత 20 ఓవర్లలో లంక 6 వికెట్ల నష్టానికి 157 పరుగులు చేసింది. ఆసీస్ బౌలర్లు సమిష్టిగా రాణించారు. మిచెల్ మార్ష్, స్టోయినిస్ కు తప్ప బౌలింగ్ వేసిన హెజిల్‌వుడ్, కమిన్స్, స్టార్క్, అగర్, మ్యాక్స్‌వెల్ లకు తలా ఓ వికెట్ దక్కింది. స్వల్ప లక్ష్య ఛేదనలో ఆసీస్ ఇన్నింగ్స్ ను ఆసీస్ నెమ్మదిగా ప్రారంభించింది. ఓపెనర్ డేవిడ్ వార్నర్ (11), మిచెల్ మార్ష్ (17) త్వరగానే పెవిలియన్ చేరినప్పటికీ ఆరోన్ ఫించ్ (42 బంతుల్లో 31 నాటౌట్, 1 సిక్సర్), గ్లెన్ మ్యాక్స్‌వెల్ (11 బంతుల్లో 23, 2 ఫోర్లు, 2 సిక్సర్లు)లు మూడో వికెట్ కు 29 పరుగులు జోడించారు. చమీక కరుణరత్నే వేసిన 12.2 ఓవర్లో మ్యాక్స్‌వెల్ బౌండరీ లైన్ వద్ద అషేన్ బండారా సూపర్ క్యాచ్ తో నిష్క్రమించాడు. ఈ స్థితిలో బ్యాటింగ్‌కు వచ్చిన స్టోయినిస్ మెరుపులు మెరిపించాడు. లంక బౌలర్లను వరుసపెట్టి బాదుతూ ఆసీస్ స్కోరు వేగాన్ని రాకెట్ కంటే స్పీడ్‌గా పెంచాడు. తాను ఎదుర్కున్న మూడో బంతికి ఫోర్ బాదిన అతడు.. శనక వేసిన 14వ ఓవర్లో వరుసగా రెండు బౌండరీలు బాదాడు. ఇక హసరంగ వేసిన 15వ ఓవర్ లో 6, 4, 6 తో వీరబాదుడు చూపాడు. తీక్షణ వేసిన 16వ ఓవర్లో వరుసగా మూడు సిక్సర్లు కొట్టాడు. చివరి సిక్సర్ తో స్టోయినిస్... 17 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. కుమార వేసిన 17వ ఓవర్లో భారీ సిక్సర్ కొట్టిన స్టోయినిస్ మ్యాచ్‌ను ముగించాడు.

విండీస్ జట్టు కోచ్ సిమన్స్ రాజీనామా

మెల్‌బోర్న్: వెస్టిండీస్ క్రికెట్ జట్టు హెడ్ కోచ్ ఫిల్ సిమన్స్ సంచలన నిర్ణయం తీసుకున్నా డు. టీ20 ప్రపంచకప్ 2022లో విండీస్ ఘోర వైఫల్యానికి నైతిక బాధ్యత వహిస్తూ కోచ్ పదవికి రాజీనామా చేశాడు. ఈ ఏడాది చివర్లో ఆస్ట్రేలియాతో జరిగే టెస్ట్ సిరీస్ అనంతరం తన బాధ్యతల నుంచి తప్పుకోనున్నట్లు సిమన్స్ వెల్లడించాడు. ఈ విషయాన్ని విండీస్ క్రికెట్ బోర్డు కూడా ప్రకటించింది. 'వెస్టిండీస్ అనేది కేవలం ఒక జట్టు మాత్రమే కాదు... కొన్ని దేశాల కలయిక... టీ20 ప్రపంచకప్‌లో మా జట్టు ప్రదర్శన అభిమానులకు నిరాశ కలిగించింది. మేము ఈ టోర్నీలో మా స్థాయికి తగ్గట్టు రాణించలేదు. ఇందుకు కరేబియన్ అభిమానులను క్షమాపణలు కోరుతున్నా ను. ఇక ఆస్ట్రేలి యాతో టెస్ట్ అనంతరం ప్రధాన కోచ్ పదవికి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నాను. ఇది నేను స్వయంగా ఆలోచించి తీసుకున్న నిర్ణయం మాత్రమే. ఆస్ట్రేలియా గడ్డపై మా జట్టు టెస్టు సిరీస్ కైవసం చేసుకునేలా నేను ప్రయత్నిస్తాను' అని సిమన్స్ పేర్కొన్నా డు. ఈ ఏడాది ప్రపంచకప్‌లో వెస్టిండీస్ జట్టు కనీసం అర్హత దశను కూడా దాటలేకపోయింది. రౌండ్-1లో ఐర్లాండ్, స్కాట్లాం డ్ లాంటి వంటి చిన్న జట్ల చేతిలో కూడా ఓటమి పాలైంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.